ప్రజాశక్తి

సోమవారం 11 ఆగస్టు 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

విజయవాడ సన్ షైనర్స్ విజయఢంకా

కాకినాడ కింగ్స్‌పై 24 పరుగుల తేడాతో గెలుపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎపిఎల్ 2025 సీజన్ - 4లో విజయవాడ సన్ షైనర్స్ జట్టు వరుస విజయాలతో దూసుకుపోతోంది. ఆదివారం మధ్యాహ్నం విశాఖలోని ఎసిఎ - విడిసిఎ మైదానం వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు కాకినాడ కింగ్స్‌పై 24 పరుగుల తేడాతో విజయం సాధించి ఈ టోర్నీలో రెండో విజయాన్ని నమోదు చేసింది. టాస్ ఓడిపోయి తొలుత బ్యాటింగ్ చేసిన విజయవాడ సన్ షైనర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 195 పరుగులు చేయగా 196 పరుగులు విజయ లక్ష్యంతో బరిలో దిగిన కాకినాడ కింగ్స్ 19.1 ఓవర్లలో 171 పరుగులకు ఆలవుట్ అయింది. విజయవాడ సన్ షైనర్స్ జట్టు బ్యాటర్లలో జహీర్ అబ్బాస్ 19 బంతుల్లో 4 సిక్సులు, 7 ఫోర్లతో 57 పరుగులు సాధించి మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. అదేవిధంగా మరో బ్యాటర్ గరిమెళ్ళ సాయి పూర్ణ తేజ 38 బంతులలో 2 సిక్సులు, 3 ఫోర్లతో 46 పరుగులు సాధించి అతనికి అండగా నిలిచాడు. వీరి ఇరువురితోపాటు ఎం.అభినవ్



అర్థ సెంచరీతో రాణించిన జహీర్ అబ్బాస్

26, ధీరజ్ కుమార్ 23, ఎం.వంశీకృష్ణ 19 పరుగులు చేసి జట్టు భారీ స్కోర్ సాధించడంలో కీలక పాత్ర పోషించారు. కాకినాడ కింగ్స్ మిగతా 2లో..

స్థానిక యువత ఉపాధికి ప్రాధాన్యత

- ప్రతి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్కు
- 'ప్రజాశక్తి'తో అనకాపల్లి జిల్లా పరిశ్రమల అధికారి పికెపి.ప్రసాద్

ప్రజాశక్తి - అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు జిల్లా పరిశ్రమల అధికారి పికెపి.ప్రసాద్ తెలిపారు. రానున్న కాలంలో ప్రతి నియోజకవర్గంలో ఒక ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. జిల్లాలో ఉన్న పరిశ్రమలు, వాటి స్థితి, ఉపాధి అంశాలపై ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..





జిల్లాలో పెద్ద పరిశ్రమలు ఎన్ని ఉన్నాయి ? వాటి ద్వారా ఎంతమంది ఉపాధి పొందారు ?

జిల్లాలో 129 పెద్ద పరిశ్రమలు ఉన్నాయి. మరో 36 పరిశ్రమలను నెలకొల్పుతున్నాం. ఇప్పటి వరకూ 71 వేల మంది ఉపాధి పొందారు. అదే విధంగా జిల్లాలో సూక్ష్మ, మధ్య, చిన్న తరహా పరిశ్రమలు 24500 ఉన్నాయి. వీటిలో లక్షా 13 వేల మందికి ఉపాధి దక్కింది.

నిర్మాణ దశలో ఉన్న పరిశ్రమలు ఎక్కడెక్కడ ఉన్నాయి ?

జిల్లాలో 36 భారీ పరిశ్రమలు నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఒయు కుదిరింది. ప్రస్తుతం అవి నిర్మాణ దశలో ఉన్నాయి. అచ్యుతాపురం, పరవాడ, నక్కపల్లి మండలాల్లో ఎక్కువ పరిశ్రమలు రానున్నాయి. వీటిలో ప్రధానంగా మిట్టల్, ఎన్‌టిపిసి, ఫార్మా, బిల్డింగ్ పార్టికల్ బోర్డ్స్, మేజర్ ఫార్మా వంటివి ఉన్నాయి. వీటిలో నాలుగు ప్రొడక్షన్స్ ట్రయల్స్‌లో ఉన్నాయి.

ఇండస్ట్రియల్ పార్కు మాటేంటి ?

జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్కు రానుంది. ప్రస్తుతం అనకాపల్లి, పెందుర్తి, అచ్యుతాపురం, పాయకరావుపేట మండలాల్లో ఉన్నాయి. మిగిలిన మండలాల్లో స్థల సేకరణ జరుగుతోంది. ఐదు ఎకరాల వరకూ స్థలం ఉన్నచోట ప్లాటెడ్ ఫ్యాక్టరీలు పెడుతున్నాం.

స్వయంకృషి, సంకల్పం ఎదుగుదలకు దోహదం



ఎంఎస్ఎన్ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ మానవేంద్రరాయ్

ప్రజాశక్తి-లీగల్ : స్వయంకృషి, సంకల్పం మనిషి ఎదుగుదలకు మూల స్తంభాలని గుజరాత్ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్‌రాయ్ వ్యాఖ్యానించారు. జిల్లా కోర్టు నూతన భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ఆదివారం న్యాయ వాదుల సంఘం ఆధ్వర్యాన కీర్తిశేషులు న్యాయవాది ఎం.సత్యనారాయణ చిత్రపటాన్ని మానవేంద్రరాయ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాలకు సత్యనారాయణ ఉచిత న్యాయ సహాయం అందించారని చెప్పారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు మాట్లాడుతూ, దిగువ స్థాయి నుంచి ఎదిగి మంచి ప్రతిభ, స్ఫూర్తి కలిగి ఎందరో మిగతా 2లో..

బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయెద్దు

వార్త 8లో..

రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

వార్త 7లో..

కంబోడియాలోని ఆంధ్రా కార్మికులను కాపాడండి

వార్త మెయిన్‌లో..

నేడు విశాఖ డెయిరీ కార్మికుల 24 గంటల దీక్ష

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ డెయిరీలో అన్యాయంగా తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలంటూ సోమవారం ఉదయం 10 గంటల నుంచి మంగళవారం ఉదయం 10 గంటల వరకూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున నిరాహార దీక్ష జరుగనుంది. ఈ దీక్షలో విశాఖ డెయిరీ ఉద్యోగులు, కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, విశాఖ డెయిరీ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం.రాంబాబు ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. డెయిరీ యాజమాన్యం 20 సంవత్సరాల పైబడి పని చేస్తున్న కార్మికులను అకారణంగా, ఏ విధమైన ముందస్తు నోటీసులూ ఇవ్వకుండా జూన్ 10 నుంచి విధుల నుంచి నిలుపుదల చేసిందని, ఆ రోజు నుండి నేటి వరకు ఎన్ని సార్లు యాజమాన్యాన్ని కలిసినా ఫలితం లేకపోవడంతో ఆందోళనకు సిద్ధమయ్యారన్నారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వద్ద జరిగిన సమావేశంలో కాంట్రాక్టర్ అందరినీ విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇచ్చినా, యాజమాన్యం తీసుకోకపోవడం

జయప్రదానికి సిఐటియు పిలుపు

దుర్మార్గమన్నారు. 20 సంవత్సరాల నుంచి ఏ విధమైన కార్మిక హక్కులూ లేకపోయినా కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ చెల్లించకపోయినా, బానిసల మాదిరి డెయిరీ కార్మికులు వెట్టి చాకిరీ చేశారన్నారు. యూనియన్ పెట్టుకుని హక్కులు అడిగితే ఇచ్చినట్టే ఇచ్చి, 305 మంది కార్మికులను పనికి రాకుండా ఆపేశారన్నారు. వారి స్థానంలో ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి కార్మికులను తీసుకువచ్చి పని చేయించుకుంటున్నారని తెలిపారు. ప్లాంట్ లోపల పాలు, పెరుగు పాడైపోతున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులు తమ ఉద్యోగాల కోసం గేట్ వద్దకు వస్తే వారిపై తప్పుడు కేసులు పెట్టి అరెస్టులు చేయిస్తున్నారన్నారు. కార్మికులు నిరసన తెలిపేందుకు గాజువాక, బిహెచ్ఇఎల్, అక్కిరెడ్డిపాలెం ప్రాంతాల్లో అనుమతి ఇవ్వడం లేదన్నారు. ఈ నేపథ్యంలో 24 గంటలపాటు నిరాహార దీక్ష చేస్తున్నామన్నారు. ఈ దీక్షలకు సంఘీభావంగా విశాఖ జిల్లాలోని సిఐటియు అనుబంధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొని మద్దతుగా మాట్లాడతారన్నారు.

తొట్లకొండను పరిరక్షించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రాచీన బౌద్ధారామాలను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బౌద్ధ సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బుద్దిస్ట్ మాన్యుమెంట్స్ ప్రొటెక్షన్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ మాట్లాడుతూ సర్వే నెంబర్ 314లోని ప్రాచీన బౌద్ధ తొట్లకొండను ప్రభుత్వం కాపాడాలన్నారు. హైకోర్టు ఇచ్చిన స్టేటస్‌కో ఉత్తర్వులను ధిక్కరించి తొట్లకొండపై అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఈ అక్రమ భూదందా చేసిన వారిపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చిన్నమంగవారి పేట, పెద్దమంగవారి పేట తదితర ప్రాంతాల్లో భూకబ్జాదారులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. చిన్న జీయర్ స్వామి ఆశ్రమం నుంచి, ఆ పక్కనే యాదాద్రి నుంచి 314 సర్వే నెంబరు తొట్లకొండ కంచెను దాటి అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో భీమ్‌సేన్ వార్ ప్రతినిధులు డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్, గుడివాడ అప్పారావు, ఎస్.సత్యారావు, సూర్యనారాయణ, రాంప్రభు, భీమయ్య, మల్లయ్య రాజు పాల్గొన్నారు.

కార్పొరేటర్లను బెదిరించడం దారుణం



మాట్లాడుతున్న వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు కెకె.రాజు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి స్టాండింగ్ కమిటీ ఎన్నికలో వైసిపి అభ్యర్థులకు ఓటు వేసిన కార్పొరేటర్లను కూటమి ప్రభుత్వం భయభ్రాంతులకు గురి చేస్తోందని వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు అన్నారు. ఆదివారం సాయంత్రం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో సీక్రెట్ బ్యాలెట్‌లో ఓటు వేసిన వారి వివరాలు బయటకు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఎవరికి ఎవరు ఓటు వేశారో కూటమి నాయకులకు ఎలా తెలిసిందని అడిగారు. 2024 సాధారణ ఎన్నికల్లో కూడా ఇలాగే గెలిచారేమో అని అనుమానం కలుగుతోందన్నారు. ఎవరు ఎవరికి ఓటు వేశారో చూసి వారిని ఇబ్బంది పెట్టడం ఎంతవరకూ సమంజసమన్నారు. దీనికి ఎన్నికల అధికారులు పూర్తిగా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పులివెందులలో జరుగుతున్న తాజా ఎన్నిక నేపథ్యంలో పోలింగ్ బూతులు ఎందుకు మార్చారని ప్రశ్నించారు. ఎన్నికల అధికారులు పచ్చ చొక్కాలు వేసుకున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కూటమి రాజ్యాంగం నడుస్తోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నేతలు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే పార్టీ మారిన కార్పొరేటర్లపై అనర్హత వేటు వెయ్యాలని కోరామని, ఎలాంటి నిర్ణయమూ తీసుకోకుండా జివిఎంసి స్టాండింగ్ కమిటీ ఎన్నిక నిర్వహించారని ఆయన అన్నారు. 32 మంది బలం తమకు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

విజయవాడ సన్ షైనర్స్ విజయఢంకా

బౌలింగ్ విభాగంలో ఎం.ఆంజనేయులు 3 వికెట్లు, కె.సుదర్శన్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కాకినాడ కింగ్స్ జట్టులో పి.అర్జున్ టెండూల్కర్ 27 బంతులలో 4 సిక్సులు, 3 ఫోర్లతో 48 పరుగులు, కెప్టెన్ శ్రీకర్ భరత్ 21 బంతుల్లో 3 సిక్స్‌లు, 2 ఫోర్లతో 34 పరుగులు, ఎం.రవి కిరణ్ 12 బంతులలో 3 సిక్స్‌లు, 2 ఫోర్లతో 31 పరుగులు చేశారు. వారు మినహా మిగిలిన బ్యాటర్లు ఎవరూ ఆశించిన మేర రాణించకపోవడంతో కాకినాడ కింగ్స్ జట్టు ఓటమిపాలైంది. అద్వితీయంగా బౌలింగ్ విభాగంలో విజయవాడ సన్ షైనర్స్ జట్టు బౌలర్లు వై.పృథ్వీరాజ్, తన్నీరు భరత్ చెరో 3 వికెట్లు తీయగా, కెవిఎస్ఎన్.రాజు రెండు వికెట్లు, ఎ.లలిత్ మోహన్, గొల్లపూడి సాయి వెంకట సుమిత్ చెరో ఒక వికెట్ తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ మ్యాచ్‌లో మెరుపు వేగంతో అర్ధ సెంచరీ సాధించిన జహీర్ అబ్బాస్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

కార్పొరేటర్లను బెదిరించడం దారుణం

ఉంటే స్టాండింగ్ కమిటీ ఎన్నికలో 50 ఓట్లతో విజయం సాధించామని చెప్పారు. 18 మందికిపైగా కూటమి కార్పొరేటర్లు తమకు ఓటేశారని తెలిపారు. దీన్ని బట్టి కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత ఎంతవరకు ఉందో స్పష్టమవుతోందన్నారు. మీడియా సమావేశంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్ కెవియన్.శశికళ పాల్గొన్నారు.

స్వయంకృషి, సంకల్పం ఎదుగుదలకు దోహదం

న్యాయవాదులకు మార్గదర్శి సత్యనారాయణ అని కొనియాడారు. విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎంకె.శ్రీనివాస్ మాట్లాడుతూ, చదువుతో పాటు పదిమంది ఎదగాలన్న ఆకాంక్షతో సత్యనారాయణ ఉండేవారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, పి.నర్సింగరావు, ఎల్‌పి.నాయుడు, పైలా సన్నిబాబు, నమ్మి సన్యాసిరావు, సత్యనారాయణ కుమారుడు న్యాయవాది అనిల్ కుమార్, రాచకొండ ఉమాశాస్త్రి, జిఎం రెడ్డి, భీమలపాడు శేఖర్, బగాది తులసీదాస్, సత్యనారాయణ కుటుంబీకులు పాల్గొన్నారు.

67 గ్యాస్ సిలిండర్ల స్వాధీనం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశాల మేరకు పౌర సరఫరాల శాఖ అధికారి భాస్కరరావు నేతృత్వంలో మూడు సర్కిల్ అసిస్టెంట్ సరఫరా అధికారులు, ఏరియా చెకింగ్ ఇన్‌స్పెక్టర్లతో కూడిన మూడు బృందాలు నగరంలోని పలు ప్రాంతాలలో శని, ఆదివారాలలో ఆకస్మిక దాడులు నిర్వహించాయి. ఈ సందర్భంగా గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను నిబంధనలకు విరుద్ధంగా గృహ రహిత వాణిజ్య ప్రయోజనాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. 67 సిలిండర్లను స్వాధీనం చేసుకొని, 1955 (సెక్షన్ 6ఎ) ప్రకారం కేసులు నమోదు చేశారు.

బీచ్ రోడ్డులో
వినాయక ఉత్సవాలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : యూత్ ఐకాన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏటాలానే ఈసారీ వినాయక ఉత్సవాలను బీచ్ రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వెనుక ఉన్న ఎపిఐఐసి ఖాళీ స్థలంలో భారీగా నిర్వహించనున్నట్లు అసోసియేషన్ నిర్వాహకులు శీరపు కనకరాజు తెలిపారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఉత్సవాలను వినూత్న రీతిలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రెండు వేల కిలోల వెండితో వినాయక మూర్తిని ప్రతిష్ఠ చేయనున్నట్లు వెల్లడించారు. టిటిడి తరహాలో ఆలయ నమూనా సెట్ వేస్తున్నామని, అందుకు సంబంధించిన అన్ని అనుమతులు, ట్రాఫిక్ సహా ఉత్సవ నిర్వహణ అనుమతులు పొందామని చెప్పారు. ప్రత్యేక ఆకర్షణగా ఫ్లవర్ షో నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవ సమయంలో జరిగే ప్రత్యేక పూజలన్నీ ఉచితమని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్.లక్ష్మణ్, ఎస్.లీలాధర్, కె.భరత్, సురేష్ (సూర్య) పాల్గొన్నారు.

గిరిజన ఉద్యోగుల ర్యాలీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం విశాఖపట్నం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం మద్దిలపాలెంలోని తెలుగు తల్లి విగ్రహం నుండి ఎంవిపి.కాలనీలోని గిరిజన భవన్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. తొలుత అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సోనియా అప్పలరాజు మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవ ప్రాధాన్యతను తెలిపారు.

ప్రధాన కార్యదర్శి కటారి శోభన్ కుమార్ మాట్లాడుతూ ఆదివాసీలు వారి హక్కులపై అవగాహన పెంచుకోవాలన్నారు. జిఒ 3ని పునరుద్ధరించాలని, ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. జిసిసిలోని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు సత్యారావు, రాము, శోభన్, ప్రసాద్, కర్రి దొర, తిలక్, రామ్ నాయుడు, భవన కార్యదర్శి రామలింగం. శేఖర్, కె.ప్రసాద్ గిరిజన ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతి గృహాల్లో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలోని సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెదగంట్యాడ, పెందుర్తి బాలుర వసతి గృహాల్లో ఆదివారం పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు నిర్వహించారు. పెందుర్తిలో సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన పెందుర్తి ఎస్ఐ దేముడు నాయుడు పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ మంచి నడవడికను అవవర్చుకుని చదువుకోవాలన్నారు. భవిష్యత్తులో అత్యున్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వెంకటాద్రి వాకర్స్ క్లబ్ అధ్యక్షులు అన్నపూర్ణ, శేఖర్ పాల్గొన్నారు.

పిట్టపోరు.. పిట్టపోరు..!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'పిట్టపోరు.. పిట్టపోరు.. పిల్లి తీర్చింది' అన్న రీతిన ఇటీవల గ్రేటర్ విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి) స్టాండింగ్ కమిటీ ఎన్నికల పర్వం సాగింది. గ్రేటర్‌లో 'రివర్స్ గేమ్' స్టార్ట్ అయ్యిందా ? అన్న చందంగా అసంతృప్తులు, అంతర్గత కలహాలు ఈ ఎన్నికల సందర్భంగా బహిర్గతమయ్యాయి. ఈ క్రమంలోనే వైసిపి ఒక్క స్థానం గెలుచుకుని మొదటిసారిగా లాభపడింది. 10 మంది స్టాండింగ్ కమిటీ సభ్యులను ఎన్నుకోవాల్సిన ఈ ఎన్నికల్లో 20 మంది బరిలో నిలిచారు. ప్రస్తుత లెక్కల ప్రకారం అన్ని స్థానాలనూ కూటమి గెల్చుకోవాలి. అందుకు భిన్నంగా ఫలితాలు వచ్చాయి. తాజా బరిలో టిడిపి నుంచి 9 మంది, బిజెపి నుంచి ఒకరు, వైసిపి నుంచి 10 మంది ఉండగా టిడిపి నుంచి 8 మంది, బిజెపి నుంచి ఒకరు, వైసిపి నుంచి ఒకరు గెలిచారు. 63 మంది కూటమి పార్టీకి చెందిన కార్పొరేటర్లు ఉన్న జివిఎంసిలో 32 మంది ఉండే వైసిపి ఒక స్థానం ఎలా గెలుచుకుందన్నదే అప్పుడు ఆశ్చర్యం కలిగించే అంశం. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎంఎల్ఎ పల్లా శ్రీనివాసరావు అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోగల రౌతు శ్రీనివాసరావు ఒక్క ఓటు తేడాతో ఓడిపోవడం. ఆయనకు 49 ఓట్లు రాగా, వైసిపి నుంచి గెలిచిన సాడి పద్మారెడ్డికి 50 రావడంపై ఇప్పుడు అంతటా చర్చ జరుగుతోంది.

నాటకీయంగా సాగిన వ్యవహారం

వైసిపి గతంలో తమ పార్టీలో ఉండి జనసేనలోకి వెళ్లిన వారిపై కేంద్రీకరించి ఈ ఎన్నికలో పనిచేసినట్లు తెలుస్తోంది. ఫిరాయింపులకు పాల్పడిన వైనంపైనా కోర్టుకు వెళ్లింది. దీంతో మేయర్ పీలా శ్రీనివాసరావులోనూ ఆందోళన మొదలైంది. కోర్టు నుంచి ఎలాంటి తీర్పు వస్తుందో తన



'మేయర్' సీటు ఎగిరిపోతుందోనన్న భయం 'పీలా'ను పీడించింది. ఈ విషయంపై జనసేన కార్పొరేటర్ సాధిక్ సూటిగానే పీలాను విమర్శించారు. మరోవైపు జనసేన కార్పొరేటర్లు ఎవ్వరూ ఈ ఎన్నికల్లో పోటీ చేయలేదు.

కూటమి ధర్మం పాటింపుపై జనసేన విసుర్లు

కాగా, విశాఖకు జనసేన పార్టీ ఎంఎల్‌సి కె.నాగబాబు విచ్చేసినప్పుడు కూటమి ధర్మం ప్రకారం స్టాండింగ్ కమిటీలో మూడు సీట్లకు జనసేనకు అవకాశం ఉంటుందని పెందుర్తి ఎంఎల్ఎ పంచకర్ల రమేష్ బాబు సభా వేదికపై వెల్లడించారు. ఆ తర్వాత రోజే దక్షిణం ఎంఎల్ఎ వంశీకృష్ణ శ్రీనివాస్ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీలో నిలబడకూడదని పార్టీ హై కమాండ్ నుంచి ఆదేశాలున్నాయంటూ కార్పొరేటర్లకు తెలిపారు. కానీ ఎలాంటి ఆదేశాలూ జనసేన పార్టీ నుంచి రాలేదని ఆ పార్టీ కార్పొరేటర్లే తర్వాత ఎద్దేవా చేయడం మొదలుపెట్టారు. తొలి నుంచీ ఈ ఎన్నికలకు పీతల మూర్తియాదవ్ దూరంగా ఉండడమే కాకుండా కూటమి ధర్మాన్ని టిడిపి పాటించడం లేదన్న విమర్శ చేయడం తెలిసిందే. టిడిపి ఎంఎల్ఎలుగానీ, జనసేన ఎంఎల్ఎలుగానీ ఈ ఎన్నికను పట్టించుకోనందునే ఒక్క సీటు వైసిపికి వెళ్లిందంటూ 'కూటమి'లో లుకలుకలు కొద్దిమందిలో నడుస్తున్నాయి. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వైసిపి వాళ్లతో పాటు 18 మంది 'కూటమి'కి చెందిన వారు పద్మారెడ్డికి ఓటేశారు. దీని వెనుక రూ.లక్షల్లో ఆర్థిక లావాదేవీలు చేతులు మారాయని తెలుస్తోంది. వైసిపికి ఓటు వేసిన వీరిలో టిడిపి వారు ఆరుగురున్నట్లు టిడిపి అధిష్టానానికి సమాచారం వెళ్లింది. ఈ విషయంపై మంత్రి నారా లోకేష్ సీరియస్ అయ్యారు. వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటారన్న చర్చ ఆ పార్టీలో నడుస్తోంది. మొత్తానికి టిడిపి, జనసేన పిట్టల పోరు వైసిపి పిల్లికి లాభం చేకూర్చిందన్న కామెంట్లు వినిపిస్తున్నాయి.

గణేష్ బాబుకు సేవారత్న అవార్డు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మూడు దశాబ్దాలకుపైగా స్వార్జిత విత్తంతో పలు రంగాల్లో చేస్తున్న నిస్వార్థ సేవలకుగాను సామాజిక సేవా రంగంలో విశాఖ వాసి అయిన కొండపి ఎస్‌వి గణేష్ బాబుకు సేవారత్న పురస్కారం ప్రదానం చేశారు. హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ నేషనల్ ఛైర్మన్, ప్రెసిడెంట్ కొంపల్లి సత్యనారాయణ, హార్ట్స్ నేషనల్ ఇన్‌ఛార్జి బీరెల్లి చంద్ర శేఖర్ గుప్తా ఆధ్వర్యంలో కల్చరల్ ప్రోగ్రామ్స్, సింగింగ్, డ్యాన్సింగ్ కాంపిటీషన్స్, ప్రతిభ అవార్డ్స్ ప్రదానం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన స్వర్ణగిరి దేవాలయ వ్యవస్థాపకుడు మానేపల్లి రామారావు, తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాతల చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా గణేష్ బాబు మాట్లాడుతూ తనను ఈ అవార్డుకు ఎంపిక చేసిన హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్



అవార్డు అందుకుంటున్న గణేష్ బాబు

యాజమాన్యానికి, తాను పనిచేస్తున్న ట్వంటీ టు బై సెవెన్ సొల్యూషన్స్‌కు ధన్యవాదాలు తెలిపారు. తల్లిదండ్రులు చేసిన సేవలు, చెప్పినటువంటి పరోపకారార్థం ఇదం శరీరం అనే సూక్తిని తూచా తప్పకుండా ఆచరించడానికి ప్రయత్నం చేస్తున్నానని చెప్పారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న శ్రీకుమార్

శ్రీకుమార్‌కు ప్రశంసాపత్రం

ప్రజాశక్తి - విశాఖపట్నం : సర్టిఫైడ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్ పరీక్షల్లో కార్పొరేట్ అకౌంటింగ్ అండ్ ఆడిటింగ్ గ్రూప్ 2 సబ్జెక్ట్‌లో దొంతు శ్రీకుమార్ ప్రతిభచాటారు. అత్యధిక మార్కులు సాధించిన ఆయనకు ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా చైర్మన్ యు.లక్ష్మణరావు, సెక్రటరీ ఎన్.వెంకటేష్ ప్రశంసాపత్రం అందజేశారు.

విఎంఆర్‌డిఎ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి -మధురవాడ : ఎండాడ జాతీయ రహదారి దగ్గర రూ.9.49 కోట్లతో విఎంఆర్‌డిఎ నిర్మించిన కన్వెన్షన్ సెంటర్‌ను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్‌గోపాల్ ఆదివారం ప్రారంభించారు. 500 మంది కెపాసిటితో నిర్మించిన ఈ సెంటర్‌లో 100 టూ వీలర్, 15 కార్లకు సరిపడే పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించారు. కన్వెన్షన్ సెంటర్‌కు విఎంఆర్‌డిఎ రూ.7.49 కోట్ల నిధులను సమకూర్చగా, ఎంపీ లాడ్స్ నుంచి రూ. 2 కోట్లు కేటాయించారు. భీమిలి నియోజకవర్గంలో రూ. 11.86 కోట్లతో నిర్మించనున్న మూడు 80 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్లకు శంకుస్థాపన చేశారు. రూ. 5.86 కోట్లతో లేక్ వ్యూ లే అవుట్ నుంచి వాంబే కాలనీ మీదుగా నగరంపాలెం వరకు రోడ్డు నిర్మిస్తారు. నగరంపాలెం నుంచి జాతీయ రహదారిని కలుపుతూ అసంపూర్తిగా ఉన్న రోడ్డును రూ.3 కోట్లతో, గ్రేహౌండ్స్ నుంచి కాపులుప్పాడ మీదుగా నగరంపాలెం వరకు ఉన్న రోడ్డును రూ.3 కోట్లతో పూర్తి చేయనున్నారు. అధునాతన సదుపాయాలతో కన్వెన్షన్ సెంటర్‌ను అందుబాటులో తీసుకురావడం పట్ల ఎమ్మెల్యే గంటా ఆనందం వ్యక్తం చేశారు. మాస్టర్ ప్లాన్ రోడ్లు పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు చాలావరకూ తీరుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ, మెట్రో రీజియన్ పరిధిలో మౌలిక సౌకర్యాలను పటిష్టం చేయడం ద్వారా అభివృద్ధికి బాటలు వేస్తున్నామన్నారు. విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్, చీఫ్ ఇంజినీర్ వినయ్‌కుమార్, సూపరింటెండెంట్ ఇంజినీర్లు మధుసూదనరావు, భవానీశంకర్, కార్పొరేటర్లు లొడగల అప్పారావు, పిల్లా మంగమ్మ, కూటమి నాయకులు శాఖారి శ్రీనివాస్, మొల్లి లక్ష్మణరావు, పిల్లా వెంకటరావు, అచ్యుతరావు, నాగోతి సత్యనారాయణ, గరే గురునాథ్, చెట్టిపల్లి గోపి, మాన్యాల సోంబాబు, వాండ్రాసి అప్పలరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



కన్వెన్షన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా

జర్నలిస్టులకు హెల్మెట్ల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో ఉన్న పలువురు జర్నలిస్టులకు ఆదివారం టిడిపి యువ నేత గంటా రవితేజ హెల్మెట్లు పంపిణీ చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిక్కాల విజయ్‌బాబు, కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి, గంటా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నాటిక పోటీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎండిఓ కార్యాలయంలో కళాసాహితీ సంస్థ ఆధ్వర్యాన శనివారం ప్రారంభమైన నాటిక పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కళాసాహితీ సంస్థ అధ్యక్షులు పి.రాజేంద్రప్రసాద్ వర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, కళాసాహితీ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

11 నుంచి ఫార్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఈ ఏడాది ఫార్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలు ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు జరగనున్నట్లు ఎంఇఒ-1 ఎం.శివరాణి ఆదివారం తెలిపారు. మండలంలోని 67 మండల పరిషత్ ప్రాథమిక, 9 యుపి, 22 జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఫార్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఆయా తరగతులకు సంబంధించి సబ్జెక్ట్‌ల వారీగా ఈ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.

చందకలో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ'

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం చందకలో ఆదివారం వైసిపి భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు బంక సత్యం ఆధ్వర్యాన 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, గత 14 నెలలుగా కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలుచేయకపోవడంపై ఇంటింటికీ వెళ్లి వైసిపి కార్యకర్తలు కరపత్రాలు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. సంపద సృష్టిస్తానని చెప్పి రాష్ట్రాన్ని అప్పుల్లో నెట్టేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బంక శ్రీను, జడ్‌పిటిసి సభ్యుడు కోరాడ వెంకటరావు, నాయకులు మజ్జి వెంకట్రావు, పాండ్రంగి శ్రీను, చందక సూరిబాబు, కులిమి గంగరాజు, పాండ్రంకి అప్పారావు, లంక రాంబాబు, కోరాడ అప్పలస్వామి నాయుడు, గునిడి వెంకటరమణ, శిరగం దాము తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో జంతువుల పాత్ర ముఖ్యం

ప్రజాశక్తి - ఆరిలోవ : పర్యావరణ పరిరక్షణలో భూమి మీద నివసించే ప్రతి జీవరాసి పాత్ర ముఖ్యమైనదని జూ క్యూరేటర్ జి.మంగమ్మ అన్నారు. ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో ఆదివారం ప్రపంచ సింహాల దినోత్సవాన్ని జరుపుకున్నారు. దీనిలో భాగంగా జూ పార్కులో సింహాల సంరక్షణ, వాటిపై అవగాహన పెంచేందుకు ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జూ వైద్యులు, జూ వెటర్నరీ విద్యార్థులు, జంతు ప్రేమికులు, సిబ్బంది పాల్గొన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడంలో సింహాల ప్రాధాన్యం, వాటి సంరక్షణా చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ మంగమ్మ మాట్లాడుతూ, ఒక ఏడాది పాటు జూ పార్కులో ఉన్న సింహాలను దత్తత తీసుకున్న వివేక్ గోయాంక్‌ను అభినందించారు. జంతువులను దత్తత తీసుకునేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జంతువులను దత్తత తీసుకున్న వారు ఆదాయపు పన్ను చట్టం ప్రకారం, విరాళంగా ఇచ్చిన మొత్తంలో గరిష్టంగా 50 శాతం వరకు పన్ను మినహాయింపు ఉంటుందని తెలిపారు. సింహాల వెటర్నరీ చికిత్సా విధానాలు, ఆరోగ్య సంరక్షణపై సీనియర్ వెటర్నరీ డాక్టర్ పి.బానుబాబు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ క్యూరేటర్స్ బి.గోపి, పివి.చౌదరి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బి.భారతి పాల్గొన్నారు.

మధురవాడలో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్



మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధిలోని ఉడా రోడ్డు (నారాయణ కాలేజీ వెనుక) ఆధునిక సౌకర్యాలతో డాక్టర్ ఆమన్ సాయి (క్రిటికల్ కేర్ నిపుణులు, డాక్టర్ లావణ్య సంభంగి (ఎమ్‌డి పీడియాట్రిక్స్) ఆధ్వర్యాన ఆయుష్ మల్టీ-స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఆదివారం రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎస్.కోట ఎమ్మెల్యే కె.లలితకుమారి, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆయుష్ మల్టీ-స్పెషాలిటీ హాస్పటల్‌లో పీడియాట్రిక్స్, నియోనాటల్, ఎమర్జెన్సీలకు చికిత్స, న్యూబోర్న్ కేర్, ఓబ్స్టెట్రిక్, గైనకాలజీ వ్యాధులు, ఇన్‌ఫెర్టిలిటీ స్పెషాలిటీ, ప్రీ ప్రెగ్నెన్సీ కౌన్సెలింగ్, నార్మల్, సిజేరియన్ డెలివరీలు, హిస్టరోస్కోపీ, లాప్రోస్కోపీ సర్జరీలు, ఆర్థోపెడిక్ కేర్, ఇఎన్‌టి జనరల్, పల్మోనాలజీ, ల్యాబ్ ఫార్మసీ, అత్యాధునిక సౌకర్యాలతో ఆపరేషన్ థియేటర్ ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి 7వ వార్డు కార్పొరేటర్లు పిల్లా మంగమ్మ, పిల్లా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వేములవలస పిఎసిఎస్ చైర్మన్‌గా రౌతు నాగరాజు

ప్రజాశక్తి-ఆనందపురం: ఆనందపురం మండలం వేములవలస ప్రాథమిక సహకార సంఘం (పిఎసిఎస్) చైర్మన్‌గా జనసేన నాయకుడు రౌతు నాగరాజు నియమితులయ్యారు. బంటుపల్లి కల్లాలకు చెందిన రౌతు నాగరాజు జనసేన పార్టీలో కీలక సభ్యుడిగా విశేష సేవలందించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ, తమపై నమ్మకంతో పిఎసిఎస్ చైర్మన్ పదవికి కృషి చేసిన భీమిలి జనసేన ఇన్‌ఛార్జి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి డైరెక్టర్ సందీప్ పంచకర్ల, జనసేన నాయకులు శాఖరి శ్రీనుబాబు, కృష్ణయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు మజ్జి శ్రీను, శ్రీకాంత్, మండల అధ్యక్షుడు తమ్మిన అప్పలరాజులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సహకార సంఘం ద్వారా రైతుల సంక్షేమం, జనసేన పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మండలంలో జనసేన నాయకుడికి పిఎసిఎస్ చైర్మన్ పదవి దక్కడం పట్ల పార్టీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల ప్రధాన కార్యదర్శి కోరుకొండ మూర్తి, ఉపాధ్యక్షులు బాలు శివకృష్ణ, డాక్టర్ పిన్నింటి సన్యాసిరావు, ఎంసి డైరెక్టర్ రామలక్ష్మి, బొద్దాపు గోవింద్, జాన కృష్ణ, ప్రశాంత్, నాని, నర్సింగరావు, సురేష్, రాజు, లోడగల సురేష్, అభి, బంగారు నాయుడు, శంకర్, కొనిదల శంకర్రావు, సుబ్బు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



నాగరాజుకు అభినందనలు తెలుపుతున్న పంచకర్ల సందీప్

అయ్యప్ప భక్తులకు నిత్యాన్నదానం

ప్రజాశక్తి-సీతమ్మధార : అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్ట్ ఆధ్వర్యాన మండల, మకరజ్యోతి సీజన్‌లో శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం అక్కడ నిత్యాన్నదానం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ సభ్యులు పైలా ఆదిమోహన్ రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా నుండి వచ్చిన అయ్యప్ప భక్తులతో ఆదివారం శంకరమఠం మందిరంలో ట్రస్ట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిమోహన్‌రెడ్డి మాట్లాడుతూ, శబరిమలలో చేపట్టబోయే సేవా కార్యక్రమాలను వివరించారు. ట్రస్ట్ సభ్యులు కె.సిద్ధూ మాట్లాడుతూ, ఏటా నవంబర్ 16 నుండి జనవరి 17వ తేదీ వరకు శబరిమలలో తమ ట్రస్ట్ తరపున నిత్యాన్నదానాన్ని మూడు పూటలా నిర్వహిస్తామని పేర్కొన్నారు. వైద్య సహాయం అందించేందుకు అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు.

నేరాలు ఘోరాలు

సముద్రంలో మునిగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్, లైట్ హౌస్ వెనుక సముద్రంలో మునిగి ఓ వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. తగరపువలస సంతపేటకు చెందిన సరగడ అప్పలరెడ్డి (45) తన కుటుంబంతో కలిసి జివిఎంసి మూడో వార్డు పరిధి గొల్లలపాలెంలో నివసిస్తున్నారు. అప్పలరెడ్డి అతని కుమారుడు మోజెస్, కుటుంబ సభ్యులు జగన్నాథం కలిసి బీచ్‌కు వచ్చారు. అప్పలరెడ్డి, అతని కుమారుడు మోజెస్ లైట్ హౌస్ వెనుక సముద్రంలో స్నానానికి దిగారు. అలల తాకిడికి అప్పలరెడ్డి సముద్రంలో కొట్టుకు పోతుండగా అతని కుమారుడు మోజెస్ కేకలు వేశాడు. అక్కడే ఉన్న బీచ్ ఫొటోగ్రాఫర్లు వెంటనే సముద్రంలో దిగి అప్పలరెడ్డిని ఒడ్డుకు చేర్చారు. కొన ఊపిరితో ఉన్న అతన్ని వెంటనే ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని భార్య అరుణకుమారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ప్రజాశక్తి - చీడికాడ:విద్యుత్ షాక్‌తో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని జైతవరంలో చోటుచేసుకుంది. జైతవరం గ్రామానికి చెందిన లాలం లక్ష్మణమ్మ(35) సింగవరం గ్రామం సమీప తమ కల్లాల వద్ద ఆదివారం మధ్యాహ్నం పశువులకు గడ్డి కోస్తుంది. వ్యవసాయ మోటార్ కు విద్యుత్ సరఫరా చేసే విద్యుత్ వైర్ తెగి ఆమెపై పడడంతో షాక్ కు గురై ఆమె సంఘటన స్థలంలోనే మృతి చెందింది. ఈ సంఘటనపై చీడికాడ పోలీసులకు ఫిర్యాదు అందటంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి- ఎస్.రాయవరం : మండలంలో వేమగిరి గ్రామం శివారు కొండ ప్రాంతంలో కోడిపందేలు ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ విభూషణరావు తెలిపారు. ఆదివారం ఉదయం సుమారు 11 గంటలకు కోడిపందేల శిబిరంపై దాడిచేసి, 9 మందిని అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి రూ. 730 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గడ్డి మందు తాగి వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని జమాదులపాలేనికి చెందిన వివాహిత మొల్లి శ్యామల (25) గడ్డి మందు తాగి ఆదివారం ఆత్మహత్య చేసుకుందిని ఈ మేరకు మృతురాలి అన్న గొర్లి అప్పలరాజు కశింకోట పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసాడు వివరాలివి. జమాదులపాలెం గ్రామానికి చెందిన మొల్లి సూర్య అప్పారావుతో 2018లో శ్యామలకు వివాహమైంది. గ్రామంలో వ్యవసాయం చేసుకుని జీవిస్తున్న శ్యామల ఈనెల 9న ఆదివారం పాకల వద్దకు రోజులాగే వ్యవసాయ పనులకు వెళ్లింది. గ్రామానికి చెందిన వియ్యపు ఈశ్వరరావు, వియ్యపు రాజేశ్వరితో మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో గొడవ పడిన నేపథ్యంలో మనస్తాపంతోగడ్డి మందు తాగింది. మృతురాలి మామయ్య మొల్లి తాతారావు అందించిన సమాచారం మేరకు అప్పలరాజు అస్వస్థతకు గురైన శ్యామలను ఎన్‌టిఆర్ ఆసుపత్రిలో చేర్పించగా, ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కెజిహెచ్‌కి రిఫర్ చేశారు. అయితే పట్టణంలోని ఉషా ప్రైమ్ ప్రయివేటు ఆసుపత్రిలో చేర్పించగా ఆరోగ్యం విషమించి మృత్యువాత పడింది. అందిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు, పోస్టుమార్టం తర్వాత మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు. మృతురాలికి ఇద్దరు మగపిల్లలున్నారు. సిఐ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ పి మనోజ్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వినియోగంలోకి మోటారు

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి -భీమునిపట్నం స్థానిక ఎపి బాలికల గురుకుల పాఠశాలలో మరమ్మతుకు గురైన 5 హెచ్‌పి మోటారును వినియోగంలోకి తీసుకొచ్చినట్లు ఎంఇఒ ఎం.శివరాణి ఆదివారం ప్రజాశక్తికి తెలిపారు. 'గురుకులంలో సమస్యల కొలువు' శీర్షికన ఆదివారం ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి స్పందించారు. కొద్ది రోజుల క్రితం మోటారు మరమ్మతుకు గురికావడంతో ఎట్టకేలకు దానిని వినియోగంలోకి తీసుకొచ్చామని, 5వ తరగతి విద్యార్థినులు 80 మందికి పాఠ్యపుస్తకాలు అందజేసినట్లు ఎంఇఒ వివరించారు. అడ్మిషన్లు పూర్తవ్వడానికి కొంత సమయం పట్టిందని తెలిపారు. మాథ్స్ టీచర్ మినహా పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. ఎంఎస్‌సి పూర్తి చేసిన మాథ్స్ టీచర్‌ను కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేసేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టినట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న హుస్సేన్

25న కలెక్టరేట్ వద్ద పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి -ములగాడ : పెన్షనర్ల సమస్యలపై ఈ నెల 25వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఎపిఆర్‌పిఎ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.హుస్సేన్ తెలిపారు. మల్కాపురంలోని సిఐటియు కార్యాలయంలో ఎపిఆర్‌పిఎ సమావేశం ఆదివారం నిర్వహించారు. సి హెచ్.తమ్మారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్‌కె.హుస్సేన్ మాట్లాడుతూ, జులై 9వ తేదీన దేశ వ్యాప్తంగా సమ్మెలో పాల్గొన్న సభ్యులందరికీ, సెంట్రల్ పెన్షనర్లు నిర్వహించిన మానవహారంలో పాల్గొని జయప్రదం చేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు. సెప్టెంబర్ 13వ తేదీన విజయవాడలో రాష్ట్ర సదస్సు జరుగుతుందని తెలిపారు. డిసెంబర్ 22, 23వ తేదీల్లో పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సమయంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలన్నింటిలో సభ్యులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పెన్షనర్ల సంఘం మల్కాపురం జోన్ అధ్యక్షులు కె.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సామరస్యంతోనే ప్రపంచ శాంతి

ప్రజాశక్తి- సీతమ్మధార : సామరస్యంతోనే ప్రపంచ శాంతి నెలకొంటుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. హిరోషిమా, నాగసాకి సంస్మరణ దినం సందర్భంగా ప్రపంచ శాంతిని కోరుతూ ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ (ఐఎఆర్ఎఫ్) ఆధ్వర్యాన ఎల్‌బి.కాలేజీలోని గాంధీ సెంటర్‌లో ఆదివారం సదస్సు నిర్వహించారు. ఐఎఆర్ఎఫ్ చైర్మన్ నరవ ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో తొలుత సర్వమత ప్రార్ధనలు చేశారు. గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, ప్రపంచ శాంతి కోసం యుఎన్ఒ ద్వారా ఐఎఆర్ఎఫ్ కృషిచేస్తుందని తెలిపారు. ఆచార్య వి.బాలమోహన్‌దాస్, ఆచార్య కె.రవి, ఎఐఆర్ పూర్వ స్టేషన్ డైరెక్టర్ డాక్టర్ నాగసూరి వేణుగోపాల్, బ్రహ్మకుమారి రామేశ్వరి మాట్లాడుతూ, వివిధ వర్గాలు, దేశాల మధ్య సామరస్యం సాధించిన నాడే ప్రపంచ శాంతి సాధ్యం అన్నారు. ప్రపంచ శాంతి కోసం యుద్ధాలను మానుకోవాలని కోరారు. అనంతరం శాంతి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్, చాట్ల బాబూరావురెడ్డి, కరుణ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



బొత్సకు కృతజ్ఞతలు తెలుపుతున్న అదీప్‌రాజు

బొత్సను కలిసిన అదీప్‌రాజు

ప్రజాశక్తి- వేపగుంట : వైసిపి యువజన విభాగం ఉత్తరాంధ్ర జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదివారం విజయనగరంలో శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోడిగుడ్ల దేవి సాంబ, బొడ్డపల్లి హేమంత్ కుమార్, గోరపల్లి శ్రీను, రాపర్తి మాధవరావు, తమర్ల నర్సింగ్, బండారు శ్రవణ్, అంబటి శైలేష్, వేపాడ శ్రీను, మణికంఠ, శ్రీను తదితరులు ఉన్నారు.

పోటీ పరీక్షలకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఇప్పుడున్న పరిస్థితుల్లో పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని ప్రముఖ భౌతిక శాస్త్ర నిపుణులు ఎస్.పైడిరాజు విద్యార్థులకు సూచించారు. చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో ఎన్ఎంఎంఎస్ శిక్షణ పొందుతున్న విద్యార్థులనుద్దేశించి ఆదివారం ఆయన మాట్లాడుతూ, క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. ఉచితంగా శిక్షణ ఇస్తున్న ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులను అభినందించారు. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు గంటాన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, కో-ఆర్డినేటర్ ఆర్.భరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించాలని జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉక్కునగరంలో ఆదివారం ఆటల పోటీలు, సైకిల్ ర్యాలీని కార్పొరేటర్ గంగారావు, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు), ఐద్వా ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలనే నిర్ణయాన్ని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సమర్ధించడం సరికాదన్నారు. దీని వల్ల కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాన్ని తుంగలో తొక్కి ఉత్తరాంధ్ర ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందని పేర్కొన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ద్వారా అనేక మంది నిరుద్యోగులు, ప్రధానంగా నిర్వాసితులు ఉపాధి లభిస్తుందని, తద్వారా ఈ ప్రాంత అభివద్ధి జరుగుతుందని ఆశించి విలువైన భూములను ఇచ్చారని గుర్తు చేశారు. కానీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పార్లమెంటు సాక్షిగా తన అభిప్రాయాన్ని తెలిపినప్పటికీ విశాఖ ఎంపీ శ్రీభరత్ ప్రతిఘటించకపోవడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. స్టీల్ యాజమాన్యం, స్టీల్ మంత్రిత్వ శాఖలు ఇక్కడ చదువుకునే పిల్లలను చదువుకు దూరం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేసి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ, కర్మాగారంలోని పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తూ కర్మాగార భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నారని విమర్శించారు. ప్రధానంగా కాంట్రాక్టు కార్మికులలో అధిక సంఖ్యలో నిర్వాసితులు ఉన్నారన్న సంగతి తెలీదా అని ప్రశ్నించారు. స్వాతంత్ర దినోత్సవ సందర్భంగానైనా ప్రభుత్వ, యాజమాన్యాలు తమ వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకులు పి.శ్రీనివాసరాజు, పుల్లారావు, మొహిద్దిన్, నర్సింగరావు, దుర్గాప్రసాద్, రమణ, మహేష్ తదితరులతో పాటు ఉక్కు నగరంలో చదువుతున్న విద్యార్థులు ఆటల పోటీల్లోనూ, సైకిల్ ర్యాలీలోను పాల్గొన్నారు.



ఆటల పోటీల ప్రారంభంలో గంగారావు, రామస్వామి తదితరులు

దోబీఘాట్లకు స్మార్ట్ మీటర్లు పెట్టొద్దు



మాధవధారలో సమావేశమైన రజకులు

ప్రజాశక్తి-మాధవధార : రజకుల దోబీఘాట్లకు స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని ఆంధ్రప్రదేశ్ రజక వత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ఈశ్వరరావు డిమాండ్‌చేశారు. మాధవధార రజక కమ్యూనిటీ హాలు వద్ద ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం సమావేశం కె.చిట్టిబాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ, కంచరపాలెం ప్రాంతంలో రజక వృత్తిదారులు సుమారు 2 వేల మంది ఉన్నారని, వీరంతా నిరంతరం లాండ్రీ పనులు చేస్తూ, దోబీఘాట్లు వద్ద బట్టలు ఉతుకుతూ జీవిస్తున్నారని తెలిపారు. రజకులు వృత్తి చేయుటకు బిసి కార్పొరేషన్, జివిఎంసి ఉమ్మడిగా నిధులు ఖర్చు చేసి దోబీఘాట్లు నిర్మించాయని తెలిపారు. జిఒ 147 ప్రకారం దోబీఘాట్లకు కరెంటు బిల్లులను జివిఎంసి చెల్లిస్తుందని చెప్పారు. స్మార్ట్ మీటర్లు పెడితే రజకుల దోబీఘాట్లకు ఉచిత కరెంటు ఉండదన్నారు. రజకులపై విద్యుత్తు బిల్లుల భారాలు అధికంగా పడతాయని తెలిపారు. రజకుల దోబీఘాట్లు మాధవధార, మాణిక్యంబకాలనీ, కామాక్షినగర్, అయ్యప్పనగర్, కరాస, సుభాష్‌నగర్, దయానందనగర్ (చాకలిగెడ్డ) కంచరపాలెం, పైడమాంబ కాలనీ, జ్ఞానాపురం రజకుల దోబీఘాట్లకు స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని ఆయన డిమాండ్‌చేశారు. శిథిలావస్థకు చేరుకున్న దోబీఘాట్లకు మరమ్మతులు చేయించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. రజకుల సమస్యలు పరిష్కరించకుంటే జిల్లా కలెక్టరేట్ల వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కె.ఈశ్వరరావు, బి.చిన్నారావు, కె.అప్పన్న, జి.గణేష్, బి.రాజారావు, కె.గోవిందరావు, ఎ.అచ్యుతరావు, ఎం.తిరుపతిరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గణబాబు

కొత్తపాలెం పిఎసిఎస్ కార్యవర్గ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి -గోపాలపట్నం

కొత్తపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ (పిఎసిఎస్) నూతన కార్యవర్గ చైర్మన్ బొడ్డేటి విజయ్‌కుమార్, డైరెక్టర్లు కంపర ఆనంద్, గొన్నబత్తుల రాజు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ గణబాబు, డిసిసిబి చైర్మన్ కోన తాతారావు హాజరై మాట్లాడుతూ, పిఎసిఎస్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తూ, రైతులకు మేలు జరిగేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగా దుర్గ ప్రశాంతి, కార్పొరేటర్లు దాడి వెంకటరమేష్, బొమ్మిడి రమణ, శరగడం రాజశేఖర్, కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుస్తకాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ సంస్కృతి ఆధ్వర్యాన పౌర గ్రంథాలయంలో ఆదివారం నాలుగు పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. విశాఖ సంస్కృతి 13వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన సభలో రచయిత ప్రవీణ్ రచించిన తొలి అడుగులు కదా సంపుటి, గన్నవరపు నరసింహమూర్తి రచించిన మిథునం, గన్నవరపు నరసింహమూర్తి కథలు, మంచి సినిమాలు పుస్తకాలను పూర్వ ఎంపీ డివిజి.శంకరరావు, గరివిడి పశువైద్యశాల డీన్ డాక్టర్ శ్రీను, అఖిలభారత ధర్మకర్త చెరువు రామకోటయ్య, సత్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు ఆవిష్కరించారు. అనంతరం విశాఖ సంస్కృతి ప్రత్యేక సంచికను కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, తెలుగు సాహిత్యం తెలుగు భాష ఉన్నతికి గత 13 ఏళ్లుగా పాటుపడుతున్న విశాఖ సంస్కృతి మాసపత్రిక సంపాదకులు సన్యాసిరావు నిస్వార్థ కృషిని అభినందించారు మంచి కథలు, సాహిత్యం, చారిత్రాత్మక అంశాలు, కవితలు ప్రతినెల అందిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన హాస్య కథలు, కవితల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రచయిత మేడ మస్తాన్ రెడ్డి వాఖ్యాతగా వ్యవహరించారు.

పలుమార్లు ఆగిన గుండె

ఎక్మోతో ప్రాణం నిలబెట్టిన కిమ్స్ ఐకాన్ వైద్యులు

ప్రజాశక్తి -గాజువాక : పలుమార్లు ఆగిన గుండెకు ఎక్మో ఆధారంగా వైద్యం చేసి ప్రాణం నిలబెట్టినట్లు కిమ్స్ ఐకాన్ వైద్యులు తెలిపారు. ఆసుపత్రికి వచ్చిన ఒక కేసుకు సంబంధించిన వివరాలు వారి మాటల్లోనే.... విశాఖ నగరంలోని అగనంపూడి ప్రాంతానికి చెందిన 31 ఏళ్ల లక్ష్మణకుమార్‌పాండా ఒక ఫార్మా కంపెనీలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు ఐసోబ్యుటైల్ నైట్రేట్ విషపూరితమైన వాయువును పీల్చేశారు. ఫలితంగా ఆయన శరీరంలోని భాగాలకు ఆక్సిజన్ సరఫరా ఆగిపోయి, శరీరమంతా నీలిరంగులోకి మారిపోయింది. వెంటనే అతడిని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి తీసుకొచ్చిన కొద్దిసేపటికే అతడికి కార్డియాక్ అరెస్ట్ అయింది. సిపిఆర్ చేస్తున్నా కూడా పదే పదే గుండె ఆగిపోసాగింది. వరుస కార్డియాక్ అరెస్టులు కావడంతో ఆస్పత్రికి చెందిన ఎక్మో నిపుణుడు, క్రిటికల్ కేర్ విభాగం లీడ్ కన్సల్టెంట్ డాక్టర్ ఎం.రవికృష్ణ, కన్సల్టెంట్ కార్డియోథొరాసిక్, వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ సాయి మణికందన్, ఇంటర్నల్ మెడిసిన్ నిపుణుడు డాక్టర్ రవి కన్నా కలిసి రోగికి ఎక్మో పెట్టి సిపిఆర్ చేయాలని నిర్ణయించారు. అతడి గుండె, ఊపిరితిత్తులు చేయాల్సిన పనిని ఎక్మో మిషన్ చేయడంతో శరీరంలో అన్ని భాగాలకు రక్తసరఫరా పునరుద్ధరణ జరిగింది. మూడు రోజుల పాటు ఎక్మో మీద ఉంచిన తర్వాత అతడు క్రమంగా కోలుకున్నాడు.

ఐసోబ్యుటైల్ నైట్రేట్‌ను పీల్చినప్పుడు రెండు రకాల సమస్యలు రావచ్చు. మొదటిది శరీరంలోని రక్తం ఆక్సిజన్‌ను తీసుకెళ్లే సామర్థ్యం కోల్పోతుంది. రెండోది.. గుండె లయ తప్పుతుంది. లక్ష్మణకుమార్ విషయంలో పదే పదే లయ తప్పడంతో పలుమార్లు గుండె ఆగిపోయింది. గుండెలో సరఫరా స్థిరంగా లేకపోవడంతో మామూలుగా సిపిఆర్ చేసినా ప్రయోజనం దక్కలేదు. దాంతో ఎక్మో సాయంతో ఇసిపిఆర్ చేయడం వల్ల అతడి ప్రాణాలు నిలబడ్డాయి. సాధారణంగా మన గుండె, ఊపిరితిత్తులు చేయాల్సిన పనిని ఎక్మో మిషన్ చేస్తుంది. దానివల్ల విశ్రాంత స్థితిలో ఉన్న గుండె.. విషప్రభావం నుంచి కోలుకుంటుంది. ఇది విజయవంతం కావడంతో కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ వైద్యులు సంతోషం వ్యక్తం చేశారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీలో ప్రవేశాలకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పి.సురేఖ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బిఎ హిస్టరీ, బిఎ పొలిటికల్ సైన్స్, బికాం జనరల్, బికాం కంప్యూటర్ అప్లికేషన్స్, బిఎస్‌సి ఫిజిక్స్, బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్, బిఎస్‌సి మ్యాథమెటిక్స్, బిఎస్‌సి జువాలజీ కోర్సుల కోసం కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

450 మందికి ఉచిత కంటి పరీక్షలు



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- అచ్యుతాపురం : బ్రాండిక్స్ సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 450 మంది నేత్ర వైద్యులు కంటి పరీక్షలు చేశారు. శిబిరంలో 300 మందికి ఉచితంగా కంటి అద్దాలను అందించారు. 148 మంది కంటి రోగులకు మందులు పంపిణీ చేశారు. 41 మంది రోగులకు కేటరాక్ట్ సర్జరీ చేయించుకోవాలని వైద్యులు సూచించారు. వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు మజ్జిగ ఫలహారాలు భోజన సదుపాయాన్ని కల్పించారు.ఈ సందర్భంగా బ్రాండిక్స్ ఇండియా అపెరెల్ సిటీ ఇండియా పార్ట్ నర్ దొరస్వామి మాట్లాడుతూ,'బ్రాండిక్స్ ఇండియా సామాజిక ఆరోగ్య సంరక్షణ లో భాగంగా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి, అండగా నిలుస్తున్నామన్నారు.

ఘనంగా వరహాలబాబు జన్మదిన వేడుక



వరహాలబాబుకు శుభాకాంక్షలు చెబుతున్న నేతలు

ప్రజాశక్తి - పాయకరావుపేట : పాయకరావుపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు యాళ్ల వరహాల బాబు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేకును, టిడిపి సీనియర్ నాయకులు మాజీ టీడీపీ మండల అధ్యక్షులు పెద్దిరెడ్డి చిట్టిబాబు, ప్రస్తుత మండల పార్టీ అధ్యక్షులు చెంచలకు పొద్దుతో కలిసి కట్ చేశారు.కార్యక్రమంలో బిపిఎన్ చైర్మన్ దేవవరపు రాజుబాబు, చింతకాయల రాంబాబు, బొంది కాశేశ్వనాదం, గూటూరు శ్రీను, పెద్దిరెడ్డి శ్రీను, పల్లా విలియం కేరి, వంకా రమణ, జూ రెడ్డి ప్రసాద్, గోసాల శ్రీకాంత్,కుందూరు కుమార్ , వార్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు .

విద్యా రంగ పరిరక్షణే ధ్యేయం

- **ఆవిర్భావ దినోత్సవంలో యుటిఎఫ్ నేతలు**

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే యుటిఎఫ్ ధ్యేయమని పునరుద్ఘాటించారు. ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ అన్నారు. ఆదివారం యుటిఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద సీనియర్ నాయకులు ఇ. ఎల్లయ్య బాబు యుటిఎఫ్ పతకావిష్కరణ చేసారు. ఈ సందర్భంగా చినబ్బాయ్ మాట్లాడుతూ 51ఏళ్లుగా ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా యుటిఎఫ్ పనిచేస్తోందన్నారు. ప్రభుత్వాల చర్యలు ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించే దిశగా ఉండాలన్నారు. విద్యారంగాన్ని ప్రయోగశాలగా ప్రభుత్వాలు చూడకూడదన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా విద్యా విధానాలు మార్చకూడదన్నారు. సమాజానికి ఉపయోగపడే విద్యను విద్యావిధానాలను రూపొందించాలన్నారు. ప్రపంచమంతా శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి చెందుతున్న తరుణంలో, భారతీయ విద్య కూడా పురోభివృద్ధి చెందాలన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో పురోగమించే దిశగా విద్యావిధానాలు ఉండాలన్నారు. మూఢనమ్మకాలను, కులతత్వాన్ని,



పతాకావిష్కరణలో యుటిఎఫ్ నేతలు

ప్రాంతీయతత్వాన్ని, మతతత్వాన్ని విడనాడే దిశగా విద్యాసంస్కరణలు ఉండాలని పిలుపునిచ్చారు. పేద ప్రజలకు సాంకేతిక విద్య, వైద్య విద్య అందని ద్రాక్షగా మారాయని, పేద ప్రజలు కూడా ఇలాంటి ఉన్నత విద్యను అభ్యసించే దిశగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు రొంగలి అక్కునాయుడు, జిల్లా కార్యదర్శి జిఎస్ ప్రకాష్, రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లయ్య బాబు, సీనియర్ యుటిఎఫ్ నాయకులు మామిడి బాబురావు, రవి, బండారు శంకర్, ఎంకే శ్రీకాంత్, రాము, వెంకటరమణ, ఆశ పాల్గొన్నారు.

హోరాహోరీగా ఖోఖో పోటీలు



శ్రీ ప్రకాష్‌లో ఖోఖో ఆడుతున్న విద్యార్థినులు

ప్రజాశక్తి- పాయకరావుపేట: శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో సిబిఎస్ఇ క్లస్టర్ -7 అంతరరాష్ట్ర ఖోఖో పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఈనెల 9వ తేదీ నుండి 11 వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరుగుతున్న అండర్ -14, 17,19 బాలుర,. బాలికల విభాగంలో జరుగుతున్న పోటీలకు ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాల నుండి 180 కి పైగా జట్లు, సుమారు 2000 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. ఇప్పటివరకూ అండర్ -19 బాలికల విభాగంలో హైదరాబాద్, సిస్టర్ నివేదిత స్కూల్ విజేతగా నిలవగా, తిరుపతి, వెరిటాస్ సైనిక్ స్కూల్ జట్టు ద్వితీయ స్థానం, ఏలూరు సి.ఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్, జట్టు ఖమ్మం హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్ జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. మిగిలిన .విజేతలకు సోమవారం జరిగే ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేస్తారు. కార్యక్రమంలో సిబిఎస్ఇ పరిశీలకులు సిహెచ్. ఎల్ఎమ్ శ్రీనివాస్, విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపల్ ఎంవివిఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపల్ ఎం. అపర్ణ, ఆంధ్రా, తెలంగాణా నుండి పోటీలకు హాజరైన విద్యార్థులు, కోచ్‌లు, మేనేజర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి



నిరసనలో మాట్లాడుతున్న సిఐటియు నేత గనిశెట్టి

- **న్యాయం చేయాలని సిఐటియు ఆధ్వర్యాన నిరసన**
- **ప్రత్యామ్నాయం కల్పించాలని వినతి**

ప్రజాశక్తి - పరవాడ : కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల హామీలు అమలులో భాగంగా ఈనెల 15 నుంచి మహిళలకు ఉచిత ఆర్‌టిసి బస్ సౌకర్యం కల్పించడం హర్షనీయమని, అయితే ఇదే సమయంలో ఉపాధి కోల్పోతున్న ఆటో కార్మికులను ఆదుకోవాలని సిఐటియు నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రమైన పరవాడలో ఆటో కార్మికులు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ నిరుద్యోగ యువత స్వయంఉపాధికి వడ్డీలకు అప్పులు చేసిఆటో నడుపుకుంటున్నారని, వచ్చిన ఆదాయంతోనే కుటుంబపోషణతో పాటు చేసిన అప్పులకు వడ్డీలతో రుణవాయిదాలను చెల్లిస్తున్నారన్నారు. అయితే మహిళకు ఉచితబస్ సౌకర్యం కల్పించడంతో వీరి ఆదాయం గణనీయంగా తగ్గే అవకాశం ఉన్నందున ఆటో కార్మికులు మళ్లీ నిరుద్యోగులుగా మారకుండా ఆదుకోవాలని కోరారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ఆటో కార్మికుడికి వాహన మిత్ర పథకం కింద ఏటా రూ. 25 వేలు జీవనభృతి ఇచ్చి ఆదుకోవాలని, జిఒ 21 రద్దుచేసి, అన్ని రకాల పెంచిన ఫీజులు పెనాల్టీలు తగ్గించాలని, బీమాప్రీమియం తగ్గింపు, వాహన కొనుగోలుకు బ్యాంకుల ద్వారా రూ.నాలుగు లక్షల వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పి. శ్రీనివాసరావు, రాము, అప్పలరాజు, రవి పాల్గొన్నారు.

రాంబిల్లి : ఆటో కార్మికులను ప్రభుత్వమే రాంబిల్లిలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేవుడు నాయుడు మాట్లాడుతూ, మహిళలకు ఉచిత బస్ పథకంలో ఆటో కార్మికులకు అన్యాయం చేయవద్దని, వారికి జీవనభృతి కల్పించాలని కోరారు. ఆటో కార్మికులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని, భారీ స్థాయిలో విధిస్తున్న పెనాల్టీలు,చలానాలు, జరిమానాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ చందక రామకృష్ణ కార్మికులు భూపతి అప్పారావు, దేవుడు, తాతారావు, లక్ష్మణ్, చెల్లూరి దావీద్ తదితర కార్మికులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో నష్టపోతున్న ఆటో కార్మికులను ఆదుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, సిఐటియు మండల కన్వీనర్ కె సోము నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొండకర్ల జంక్షన్లో ఆటో కార్మికులతో సమావేశంలో మాట్లాడుతూ, మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పనతో ఉపాధి కోల్పోతున్న ఆటో కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కొండకర్ల ఆటో స్టాండ్ నాయకులు ఈశ్వరరావు ,సంతోష్, అనకాపల్లి చిరునీడస్టాండ్ నాయకులు రాము, అచ్యుతాపురం చోడమాంబిక యూనియన్ నాయకులు దమ్ము చండీ, రాజు, కర్రి నాయుడు, శ్రీను పాల్గొన్నారు.





రాంబిల్లి, అచ్యుతాపురంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో కార్మికులు

నడకతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న డాక్టర్ నారాయణరావు

ప్రజాశక్తి- అనకాపల్లి : నడకతోనే పలు రోగాలు నయమై, ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రముఖ వైద్యులు డాక్టర్ నారాయణరావు అన్నారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ మార్కెట్ యార్డ్ లో వాకర్స్ క్లబ్ సాధారణ సమావేశంలో శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ నారాయణ రావు 'రోగి సాధారణ సమస్యలు - నివారణోపాయాలు' అనే అంశంపై మాట్లాడుతూ, గుండె పనితీరు మనం మెట్లు ఎక్కేటప్పుడు బాగా ఆయాస పడితే, ఊపిరి తీసుకోవడం ఇబ్బందిగా ఉంటే వెంటనే డాక్టర్ ను సంప్రదించి దానికి తగ్గ పరీక్షలు చేయించుకోవాలన్నారు. మూత్రపిండాల సమస్య అధికమైందని గుర్తించిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించి తగు వైద్యం తీసుకోవాలని సూచించారు. అలాగే మధుమేహం, రక్తపోటు తదితర వ్యాధులకు పరీక్షలు చేయించుకొని చికిత్స పొందాలన్నారు. వ్యాధి నిర్ధారణ, అవసరమైన చికిత్సతోపాటు, ప్రతివ్యక్తి ఆరోగ్యం కాపాడుకోవాలంటే వ్యాయామం చేయాలని, నడకతో మంచి ప్రయోజనాలున్నాయన్నారు. శరీరానికి తగినంత శ్రమ చేస్తే అవయవాలు సక్రమంగా పనిచేస్తాయన్నారు. కార్యక్రమంలో వాకర్స్‌అధ్యక్షులు రాపేటి నారాయణ రావు, కార్యదర్శి వై శివ, కోశాధికారి కేవీవీ సత్యనారాయణ, డాక్టర్ డిడి నాయుడు, నల్లాల దేవుళ్ళు, కాండ్రేగుల సాంబశివరావు, పీవీ జగన్మోహనరావు, కొణతాల పూర్ణచంద్రరావు, వంకాయల ఈశ్వరరావు, బొగ్గరపు సర్వారావు మిగిలిన సుమారు 50 వాకర్స్ పాల్గొని డాక్టర్ నారాయణరావును సన్మానించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని ఈ బోనంగి గ్రామంలో రూ. 1.50 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఆదివారం పెందుర్తి ఎమ్మెల్యే, పంచకర్ల రమేష్ బాబు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ బోనంగి పంచాయతీలో సమస్యలన్నీ పరిష్కరిస్తానని, ప్రజల కోసం కష్టపడే నాయకులన్నా, అభివృద్ధి కోసం అడిగి చేయించుకునే వారన్నా తనకెంతో ఇష్టమన్నారు. ఈ సందర్భంగా బొద్దపువానిపాలెం ఫార్మాసిటీ కాలనీలలో సిసి రోడ్డు, కాలువలు, పంచాయతీ భవనంపై సోలార్ ప్యానెల్, ఇంటింటికి తాగునీటి సదుపాయానికి కుళాయిలను ప్రారంభించారు. అలాగే సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తహశీల్దార్, ఆర్‌డిఒలతో మాట్లాడి హౌసింగ్ పట్టాల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని,స్థానిక యువతకు పరిశ్రమల్లో ఉద్యోగాలకు ప్రాధాన్యత కల్పిస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల్లోని సమస్యలను స్థానిక కూటమి నాయకులు తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమేష్ నాయుడు, పంచాయతీ రాజ్ డిఇఇ పివి రమణమూర్తి, స్థానిక సర్పంచ్ మండల పార్టీ అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాసరావు, రావాడ, పరవాడ సర్పంచ్‌లు మోటూరు సన్యాసి నాయుడు, సిరపరపు అప్పలనాయుడు, పంచకర్ల ప్రసాదరావు, టిడిపి మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, మాజీ జెడ్‌పిటిసి పైల జగన్నాధరావు, అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, రూరల్ జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి బిగిడి రామగోవింద, మాజీ సర్పంచ్ అట్టా సన్యాసప్పారావు, బొద్దపు వెంకట రమణ, ఉప సర్పంచ్ మేడిశెట్టి వెంకట్రావు, వార్డు సభ్యులు చందక కృష్ణ, చందక గోవింద, మంత్రి గిరి ప్రసాద్, బొద్దపు సూర్యలక్ష్మి, మేడిశెట్టి అప్పారావు, బొద్దపు నాగమణి పాల్గొన్నారు.

ఘనంగా గోవింద్ పుట్టిన రోజు వేడుక



గోవింద్‌కు కేకు తినిపిస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి - పాయకరావుపేట : మండలంలోని శ్రీరాంపురంలో ఆదివారం గంగిరెడ్డి వెంకటరమణ ఇంటి వద్ద వైసిపి పాయకరావుపేట మండల అధ్యక్షులు బోడపాటి గోవిందు పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు, నాయకులు, కార్యకర్తలు సమక్షంలో గోవిందును శాలువాలతో సత్కరించారు. పూలమాలలు, బొకేలు అందజేసి అభినందించారు. బర్త్ డే కేక్ కట్ చేయించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు గెడ్డమూరి శ్రీనివాసరావు (దొంగబాబు), పార్టీ శ్రీరాంపురం గ్రామ శాఖ అధ్యక్షుడు తిరుమలరాజు నరసింహరాజు, ప్రసాద్ రాజు, ఎంపిటిసి పులగల రాంబాబు, బగ్గ బాబూజీ, అల్లాడ రామకృష్ణ , బావరవు అప్పారావు, గంగిరెడ్డి గణేష్ , పోలవరపు నాగేశ్వరరావు, గొర్ల రాజు, చందక గంగారావు, గంగాధర్, సురేష్, అప్పలకొండ పాల్గొన్నారు.

పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు



రమణను సత్కరిస్తున్న తులసీరావు

ప్రజాశక్తి-మునగపాక: అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు ఎప్పుడూగుర్తింపు ఉంటుందని పిడిసి నిర్వాహకులు, ఆల మహేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు పెంటకోట తులసీరావు అన్నారు. ఆదివారం అచ్యుతాపురం బదిలీ అయిన స్థానిక శాఖ గ్రంథాలయాధికారి ఎలిపి. రమణను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మునగపాకలో ఆరేళ్లపాటు అంకితభావంతో విధులు నిర్వహించిన రమణ గ్రంథాలయ అభివృద్ధికి విశేష కృషి చేశారని, తన సొంత నిధులు ఖర్చుపెట్టిన సందర్భాలు ఉన్నాయన్నారు. విజ్ఞాన శిబిరాలు నిర్వహించి పిల్లలు, పేరెంట్స్ తోపాటు స్థానిక ఉపాధ్యాయులను ఆయా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం ద్వారా విజయవంతానికి కృషి చేశారన్నారు.కార్యక్రమంలో ప్రస్తుత గ్రంథాలయ అధికారిని వరలక్ష్మి, బిడిసి నిర్వాహకులు ఆడారి జగప్పారావు, మల్ల గణేష్, కర్రి వెంకట అప్పారావు, ఆళ్ల సూరిబాబు, కోటేశ్వరరావు, టెక్కలి జగ్గారావు, ఎం వి ఎస్ నారాయణ, పిల్ల జగదీష్, పాఠకులు ఆడారి అప్పలనాయుడు, కరుణాకర్ రావు, సిబ్బంది వేగినాయుడు, అమ్మ పాల్గొన్నారు.

నాటుసారా తాగి అస్వస్థత

ప్రజాశక్తి-ఎస్ రాయవరం :మండలంలోని పెదఉప్పలం గ్రామానికి చెందిన వ్యక్తి నాటు సారా తాగడంతో తీవ్ర అస్వస్థతకు గురైనట్టు బాధితుడు కుమారుడు లోవరాజు తెలిపాడు. ఆదివారం బాధితుడు కుమారుడు ఇచ్చిన సమాచారం మేరకు పెదఉప్పలం గ్రామానికి చెందిన పెంకె సన్యాసిరావు నాటుసారాకు బానిసయ్యాడు. పది రోజులుగా అదేపనిగా గామంలో యూరియా, బెల్లంతో తయారుచేస్తున్న నాటు సారాను తాగుతుండడం వలన నాలుగు రోజులు క్రితం రెండుకాళ్ళు, రెండు చేతులు పని చేయడంలేదని వాపోయాడు. గ్రామంలో నాటు సారా ఏరులై పారుతోందని, గుట్టుచప్పుడు కాకుండా ప్యాకెట్ రూ.యాభై చొప్పున గ్రామంలో ఆరు చోట్ల అమ్ముకాలు చేస్తూ, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడు తున్నారన్నారు. ఈ విషయమే సంబంధిత అధికారులకు గ్రామపెద్దలు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. గ్రామంలోని తోటల్లో నాటుసారా తయారీ జోరుగా సాగుతోందన్నారు. తన తండ్రిలాగే వేరొకరు బలికాకుండా నాటుసారా తయారీ, విక్రయాలు అరికట్టాలని కోరారు.

పర్యావరణ విధ్వంసాన్ని ఆపాలి

• జిల్లా మహాసభలో జనవిజ్ఞాన వేదిక నేతలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : జిల్లాలో జరుగుతున్న పర్యావరణ విధ్వంసాన్ని ఆపాలని ప్రభుత్వాన్ని కోరుతూ జన విజ్ఞాన వేదిక జిల్లా మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆదివారం దేవరాపల్లి మండల కేంద్రంలోని కైరలి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో జనవిజ్ఞాన వేదిక, అనకాపల్లి జిల్లా 18వ మహాసభ నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుండి 52 మంది ప్రతినిధులు హాజరయ్యారు. మహాసభకు రాష్ట్ర నాయకులు కె. త్రిమూర్తులురెడ్డి, కె. శేషగిరిరావు రాష్ట్ర పరిశీలకులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడం కోసం సైన్స్ మ్యాజిక్‌షో, ప్రయోగాల ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని మహాసభ మరో తీర్మానాన్ని ఆమోదించారు. అనంతరం రాబోయే రెండేళ్లకు నూతన కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

గౌరవాధ్యక్షులుగా దినేష్ (దేవరాపల్లి), కె.త్రిమూర్తులు (నర్సీపట్నం), అధ్యక్షులుగా ఎంఎస్‌వి ఎస్‌పి. వర్మ (కశింకోట), ప్రధాన కార్యదర్శిగా కె. వరప్రసాద్ (ఎస్. రాయవరం), ఉపాధ్యక్షులుగా బివిఎస్.వేణు (కె.కోటపాడు), బిఎస్.రామ్‌కుమార్ (అచ్యుతాపురం), ప్రకాష్ (చోడవరం), ప్రధాన కార్యదర్శిగా కె. వరప్రసాద్ (ఎస్. రాయవరం), కార్యదర్శులుగా టి.నాగచంద్ర (వి. మాడుగుల), ఎం. వెంకట అప్పారావు (అచ్యుతాపురం), కె.రాంబాబు (దేవరాపల్లి), కోశాధికారిగా బి. ఉమా మహేశ్వరరావు, (అనకాపల్లి) మరో ఏడుగురితో నూతన కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.



మహాసభలో పాల్గొన్న జెవివి నేతలు



జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వర్మ, వరప్రసాద్

రూ.6.80 కోట్లతో వార్డు అభివృద్ధి



మాట్లాడుతున్న కార్పొరేటర్ చిన్నతల్లి

ప్రజాశక్తి,-అనకాపల్లి రూరల్: జివిఎంసి 84 వ వార్డు పరిధిలో రూ.6.80 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు స్థానిక కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి వెల్లడించారు. తమ ప్రాంత అభివృద్ధికి నిధులు మంజూరులో సహకరించిన ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కెఎన్ఆర్ పేటలో రూ.19 .95 లక్షలతో సిసి రోడ్లు, కాలువలు, రూ.19.95 లక్షలతో కమ్యూనిటీ హాల్, సాలాపువానిపాలెంలో రూ.19.86 లక్షలతో ఎస్‌డబ్ల్యు డ్రైన్, సిరసపల్లి గ్రామంలో రూ.39.98 లక్షలతో ఎస్‌డబ్ల్యు డ్రెయిన్ , సిసి రోడ్, కాలువలు,, పట్టణంలో బాలకృష్ణ బస్టాండ్ వద్ద రూ.49.93 లక్షలతో, లక్ష్మీనారాయణ నగర్‌లో రూ.49. 70 లక్షలతో, మార్కెట్ సమీపంలో రూ.49.40 లక్షలతో, లక్ష్మీనారాయణ నగర్ నుంచి కొట్ని వీధి వరకు రూ.49.90 లక్షలతో, హేమశేఖర్ కాలేజ్ నుంచి మరిడిమాంబ గుడి వరకు రూ.49.80 లక్షలతో సిసి రోడ్ సిసి డ్రైన్, కొప్పాక జంక్షన్ నుంచి ఆర్టీవో ఆఫీస్ వరకు రూ.49.90 లక్షలతో ఎస్ డబ్ల్యు డ్రైన్, కోల్డ్ స్టోరేజ్ నుంచి రైల్వే స్టేషన్ వరకు రూ.94.10 లక్షలతో బీటీ రోడ్డు, పెరుగు బజార్ నుంచి గాంధీ బొమ్మ జంక్షన్ వరకు రూ.98 లక్షలతో బీటీ రోడ్డు చేపడుతున్నట్లు వెల్లడించారు.

సమావేశంలో రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు మాదంశెట్టి నీలబాబు, ఎన్నికల కోఆర్డినేటర్ బొలిశెట్టి శ్రీనివాసరావు, 84వ డివిజన్ ప్రెసిడెంట్ తలారి లక్ష్మీప్రసాద్, ప్రధాన కార్యదర్శి సాలాపు మోహన్, ఉపాధ్యక్షులు పిల్లా తారకేశ్, కార్యవర్గం కార్యదర్శులు సూరారపు వెంకటగిరి, రేబాక ఈశ్వర అప్పారావు, నమ్మి రామారావు మీడియా కోఆర్డినేటర్ అలంక బోగేశ్, తెలుగు యువత అధ్యక్షులు మిర్తిపాటి మురళి ,మేడిశెట్టి సత్తిబాబు, బీసీ సెల్ అధ్యక్షులు చూచుకొండ రమణ, ప్రధాన కార్యదర్శి కాండ్రేగుల జగదీశ్వరరావు, దానబోయిన నీలకంఠరావు తదితరులు పాల్గొన్నారు

తాళ్లపాలెంలో మోస్తరు వర్షం

ప్రజాశక్తి -కశింకోట : మండలం లో తాళ్ల పాలెంలో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది, నాలుగు రోజులుగా వేసవిని తలపించిన ఎండ దెబ్బకు ఇబ్బందిపడ్డ ప్రజలు, కురిసిన చిన్నపాటి వర్షంతో కాస్త ఉపశమనం పొందారు, అయితే ఖరీఫ్ సీజన్‌లో ముమ్మరంగా వ్యవసాయ పనులు సాగాల్సిన ప్రస్తుత పరిస్థితుల్లో వర్షాభావంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. మరింత వర్షం కురిస్తే ఉపయోగకరమని అంటున్నారు.

13న 'క్విట్ కార్పొరేట్స్' నిరసనను జయప్రదం చేయండి



నిరసనకు సంఘీభావం తెలుపుతున్న రైతు సంఘాలు

ప్రజాశక్తి- అనకాపల్లి : కేంద్ర ప్రభుత్వ రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 13న అనకాపల్లి పట్టణంలో నిర్వహించే క్విట్ కార్పొరేట్స్ నిరసన బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని సంయుక్త మోర్చా, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి పిలుపునిచ్చింది. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో క్విట్ ఇండియా ఉద్యమ పోరాట స్ఫూర్తితో, 13న 'క్విట్ కార్పొరేట్స్'కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా చేప పిలుపుతో ఎస్‌కెఎం భాగస్వామ్య రైతు సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగి ఎస్‌కెఎం జిల్లా కన్వీనర్ కర్రి అప్పారావు అధ్యక్షత కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా దేశవ్యాప్తంగా అనేక రూపాల్లో ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని, దీనిలో భాగంగానే అమెరికా, బ్రిటన్ దేశాలతో ద్వైపాక్షిక ఒప్పందాలను చేపడుతుందన్నారు. ఇది రైతాంగానికి తీవ్ర నష్టదాయకమని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే జాతీయ వ్యవసాయ మార్కెట్ చట్టాన్ని సవరించే ముసాయిదాను అమలు చేయడానికి ప్రయత్నిస్తుందని, కార్మిక చట్టాలను కాలరాచే 4 లేబర్ కోడ ల అమలు కోసం ప్రయత్నాలు మొదలు పెట్టిందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్కరణలు వేగవంతం చేస్తూ, అదానీ స్మార్ట్ మీటర్లను బిగించేందుకు చర్యలు చేపడుతున్నదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేట్ కంపెనీల కోసం వేలాది ఎకరాల భూ సేకరణ చేపడుతూ, సన్న చిన్న కారు రైతాంగాన్ని, దేశ ప్రజలను నిర్వాసితులను చేస్తున్నారని వాపోయారు.కార్పొరేట్లు, బహుళజాతి కంపెనీల దోపిడీ ప్రయోజనాలకు చేపడుతున్న పాలకుల విధానాలకు వ్యతిరేకంగా 'క్విట్ ఇండియా' ఉద్యమస్ఫూర్తితో జరిగే "క్విట్ కార్పొరేట్స్" బైక్ ర్యాలీలో ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) జిల్లా కార్యదర్శి కోన మోహన్ రావు, రైతు స్వరాజ్య వేదిక నాయకులు గాడి బాలు, సిఐటియు జిల్లా నాయకులు ఆర్ శంకర్ రావు, వి శ్రీనివాసరావు, అడ్వకేట్, ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్ బాబు, ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయినబాబు పాల్గొన్నారు.

ప్రయాణ సంకటం!

- ప్రధాన కూడళ్లలో రహదారులు ఛిద్రం
- భారీ గుంతలతో రాకపోకలకు ఇక్కట్లు
- అమలుకు నోచుకోని చంద్రబాబు హామీ



గోతులమయమైన రోడ్డు

ప్రజాశక్తి - పరవాడ : మండలంలో ప్రధాన కూడళ్లలో రహదారుల్లో పెద్ద గోతులు ఏర్పడడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది.ఈ గోతులతో ప్రయాణం ప్రమాదకరంగా మారిందని భయాందోళన చెందుతున్నారు. గుంతలు పూడ్చమని ప్రయాణికులు, వాహనదారులు వేడుకున్నా పట్టించుకునే నాధుడు కరువయ్యారని విమర్శలు గుప్పిస్తున్నారు. ఆయా మార్గాల గుండా ప్రయాణిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారుల సైతం నిత్యం అధ్వానంగా మారిన రోడ్డు పట్టించుకునే పరిస్థితి లేదని మండిపడుతున్నారు.
మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ కూడలి, పరవాడ సినిమా హాల్ కూడలి, ఎన్‌టిపిసి ఊటగెడ్డ కూడలి, తహసీల్దార్ ఆఫీస్ కూడలి, పరవాడ-లంకెలపాలెం ప్రధాన రహదారిలోని తిరుపతి బొగ్గు కంపెనీ వద్ద రహదారిలో గుంతలు వాహనదారుల ప్రాణసంకటంగా మారాయి. ఈ మార్గాల్లో ప్రతిరోజూ వందల సంఖ్యలో బొగ్గు లారీలు, భారీ వాహనాలు, అచ్యుతాపురం ఇండస్ట్రియల్ పార్కు, బ్రాండెక్స్ కంపెనీ బస్సులు, ఆటోలు, ద్విచక్రవాహనాలు, ఆర్‌టిసి బస్సులు రాకపోకలు సాగిస్తాయి. ముఖ్యంగా అధిక లోడుతో బొగ్గు లారీలు దూసుకెళ్లడం వల్ల రహదారులు ఛిదిమిపోతున్నాయి.

గుంతల్లో వాహనాలు అదుపుతప్పి ప్రమాదం అధికమవుతోంది. ఇప్పటికే పలువురు బైకిస్టులు గోతుల్లో పడి గాయాలపాలైన ఘటనలు చోటు చేసుకున్నాయని స్థానికులు చెబుతున్నారు. రాత్రివేళ గుంతలు కనిపించక ప్రమాదాలు మరింత పెరుగుతున్నాయి. గత నవంబరులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ పరవాడ నుంచే రాష్ట్రవ్యాప్తంగా 'గుంతలు పూడ్చే కార్యక్రమం' ప్రారంభించి, సంక్రాంతికల్లా అద్దాల్లాంటి రహదారులు అందిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఎనిమిది నెలలు గడిచినా పరిస్థితి మరింత ఇసుమంతైనా మెరుగుపడకపోగా, మరింత దారుణంగా మారిందని వాహనదారులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారి మరమ్మతులపై సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు కనీస శ్రద్ధ చూపడం లేదని మండిపడుతున్నారు.

తక్షణ చర్యలు చేపట్టాలి

రోజూ ఈ రోడ్లపై ప్రయాణం ప్రాణప్రమాదంగా ఉందని, వెంటనే గుంతలు పూడ్చి, రహదారులను రాకపోకలకు సురక్షితంగా మార్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పరవాడ మండలంలోని ప్రధాన కూడళ్ల, ప్రమాదకర రహదారులను తక్షణమే పునర్నిర్మించాలని, ప్రభుత్వం, ఆర్అండ్‌బీ శాఖ వెంటనే స్పందించాలని వాహనదారులు కోరుతున్నారు.

రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

-స్పీకర్ అయ్యన్న, హోం మంత్రి అనిత - తాండవ నీరు విడుదల

ప్రజాశక్తి- నాతవరం: రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని స్పీకర్ అయ్యన్న, హోం మంత్రి అనిత తెలిపారు. జిల్లాలోని మేజర్ ప్రాజెక్టు తాండవ రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు నీటిని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, హెూం మంత్రి వంగలపూడి అనిత పూజలు నిర్వహించి ఆదివారం నీటిని విడుదల చేశారు. అనంతరం జలహారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, నర్సీపట్నం, పాయకరావుపేట, కాకినాడ జిల్లా ప్రాంతాలకు తాండవ ప్రాజెక్టు ద్వారా పంటలకు నీరు అందుతుందన్నారు. గత ప్రభుత్వ కాలంలో తాండవను నిర్లక్ష్యం చేశారన్నారు. 7 లక్షల రూపాయలతో గేట్లు మరమ్మత్తు చేయలేక పోయారని విమర్శించారు. తాండవ జలాశయం ద్వారా సుమారు 51,465 ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఇందులో అనకాపల్లి జిల్లాలో 32,689 ఎకరాలకు, కాకినాడ జిల్లాలో 18,776 ఎకరాలకు నీరు సరఫరా అవుతుందన్నారు. గత ఏడాది పలు పనులతో మొత్తం తాండవ ప్రాజెక్టు అభివృద్ధి జరిగిందన్నారు. తాండవ జలాశయం పూర్తి సామర్థ్యం 4.96 టీఎంసీలు కాగా, ప్రస్తుతం నీటి నిల్వ 2.92 టీఎంసీ ఉందన్నారు.

హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, తాండవ ఆయకట్టుపై వేలాది మంది రైతులు ఆధారపడ్డారని తెలిపారు. తాండవ రిజర్వాయర్ నీటి విడుదల కార్యక్రమంలో పాల్గొనడం తన అదృష్టమన్నారు.గత ప్రభుత్వంలో తాండవ రిజర్వాయర్‌ను పట్టించుకోలేదని విమర్శించారు.ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తరువాత స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆధ్వర్యంలో రిజర్వాయర్ గేట్లను మరమ్మతు చేశారని తెలిపారు. రైతుల అభ్యున్నతికి ఎన్డీఏ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ జీవి వెంకటరమణ, తుని మార్కెట్ యార్డ్ చైర్మన్, జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ సూర్యచంద్ర, నాతవరం మండలం టిడిపి పార్టీ అధ్యక్షుడు నందిపల్లి రమణ, అధికారులు, నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్న

రావణాపల్లి రిజర్వాయర్ నీటి విడుదల

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని రావణాపల్లి రిజర్వాయర్ నీటిని ఆదివారం మున్సిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేష్, అయకట్టు చైర్మన్ రాజేశ్వరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా చింతకాయల రాజేష్ మాట్లాడుతూ, కాలువలపై ఉన్న గేట్లు, కల్వర్టుల మరమ్మతుకు రూ.1.20 కోట్ల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. మరో కోటి రూపాయల వ్యయంతో ఇతర పనులు చేపట్టేందుకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు నిర్ణయించారన్నారు. కాలువల మరమ్మతులకు అదనంగా రూ.10 లక్షలు మంజూరయ్యాయని వివరించారు.

అయకట్టు చైర్మన్ రాజేశ్వరావు మాట్లాడుతూ, రూ.3.50 లక్షల వ్యయంతో కొత్త గేట్ల పనులు పూర్తి చేశామని చెప్పారు. డీఈఈ బాల సూర్యం మాట్లాడుతూ, గతంలో స్లూయిజ్ నుంచి నీరు వృథాగా పోతుండేదని, దీనిపై స్పీకర్ స్పందించి మరమ్మతులకు నిధులు మంజూరు చేయించారని వివరించారు.

రోడ్డుపై ప్రవహిస్తున్న వాడుక నీరు

-అవస్థలు పడుతున్న పాదచారులు -పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -వడ్డాది: ఎండ కాలం వలె ఎండలు మండి భూగర్భ జలాలు ఎండిపోయినా ఈ రహదారి పైన నీరు మాత్రం ఎప్పుడూ ప్రవహిస్తూనే ఉంటుంది. బుచ్చయ్యపేట మండలం ఎల్బీపీ అగ్రహారం పంచాయతీ పరిధిలో ఆర్ అండ్ బి రోడ్డుని అనుకుని ఉన్న వీధి కుళాయి నుండి నీరు వృథాగా పోయి రోడ్డు అంతా బురదగా మారుతుంది. వీధి కుళాయిల వద్ద వాడుక నీరు పోవడానికి మార్గం లేక ఆర్ అండ్ బి రోడ్డు గుండా ప్రవహిస్తుంది. ఇది ఇప్పటి నుండి కాదు కొన్ని సంవత్సరాల నుండి ఇదే పరిస్థితి ఏర్పడుతుంది. వీధి కుళాయి వద్ద, పక్కనున్న ఇల్లల వద్ద నుండి వాడుక నీరు ఆర్అండ్‌బి రోడ్డుపై ప్రవహించడంతో రోడ్డు గుంతలుగా మారి నీరు నిల్వ ఉండిపోతుంది. దీంతో, వాహనదారులు వెళ్లేటప్పుడు నీరు పాదచారులపై తుళ్లటంతో ఇబ్బందులకు గురి అవుతున్నారు. రోడ్డు పక్కనే ఉన్న గుంతల్లో ఈ వాడుక. నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లి పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇదే రోడ్డు గుండా పంచాయితీ అధికారులు, సచివాలయం సిబ్బంది రోజు వెళుతుంటారు. కనీసం ఇక్కడ ఇంకుడు గుంతలైనా తవ్వించే ఏర్పాటు చేయలేదు.అధికారులు స్పందించి వాడుక నీరు రోడ్డు పైకి రాకుండా తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


రోడ్డుపై ప్రవహిస్తున్న వాడుక నీరు

పలుచోట్ల రక్తదాన శిబిరాలు


కొత్తకోటలో రక్తదానం చేస్తున్న దాత

ప్రజాశక్తి -రావికమతం: మండలంలో కొత్తకోట రవి థియేటర్ వద్ద తాసుబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నర్సీపట్నం డిఎస్పి పోతిరెడ్డి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఇటువంటి మంచి సేవా కార్యక్రమాన్ని చేపడుతున్న తాసుపల్లి ఫౌండేషన్ సభ్యులకు అభినందనలు తెలిపారు. రక్తదానం మరొకరి ప్రాణాలను కాపాడుతుందన్నారు. అనంతరం రక్తదానదాతలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ జడ్పిటిసి తలారి ఆదిమూర్తి, గ్రామ సర్పంచ్ కోన లోవరాజు, ఉపసర్పంచ్ పందల దేవ, స్థానిక పంచాయతీ వార్డు సభ్యులు పూడి నాగరాజు, కొసిరెడ్డి శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

101 యూనిట్ల రక్తదానం

ఆనందపురం : ఆనందపురం మండలం మామిడిలోవ గ్రామంలో శ్రీ సత్య సాయి బాబా 100వ జయంతిని పురస్కరించుకొని శ్రీ సత్య సాయి సేవా ఆర్గనైజేషన్ విశాఖపట్నం జిల్లా ఆధ్వర్యాన మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బలిరెడ్డి ఈవెంట్స్ అధినేత బలిరెడ్డి పెంటయ్య సమన్వయంతో, కెజిహెచ్ బ్లడ్ బ్యాంక్, విశాఖ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో నిర్వహించారు. బాబా భక్తులు, చుట్టుపక్కల గ్రామాల యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా 101 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా కనమాం సర్పంచ్ ఆబోతు అప్పలరాము, రామవరం సర్పంచ్ ఎర్ర పైడిరాజు, గండిగుండం మాజీ సర్పంచ్ ఆర్.కోటి రక్తదానం చేసి యువతకు స్ఫూర్తిగా నిలిచారు. రక్తదాన శిబిరంలో విశాఖపట్నం జిల్లా జెంట్స్ సేవాదళ్ కో-ఆర్డినేటర్ ఆర్ఎఎస్ నాయుడు, జిల్లా మెడికల్ కో-ఆర్డినేటర్ బిఎస్.కుమార్, విశాఖ జోనల్ కో-ఆర్డినేటర్ సత్యకుమార్, కె.సంతోష్, టి.అప్పారావు, బి.అప్పలరాము, ఎ.దేవుడుబాబు, కె.శివాజీ పాల్గొన్నారు.


పాల్గొన్న సర్పంచులు అప్పల రాము. పైడిరాజు

చోడవరం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా సంతోషి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట: చోడవరం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా బుచ్చయ్యపేట మండలం రాజాం గ్రామానికి చెందిన మరిసా సంతోషి ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు ఎం వి వి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదల సత్యనారాయణ, మాజీ మండల పార్టీ అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, ఎంపిపి దాకారపు నాగేశ్వరి దేవి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



అర్ధరాత్రి విద్యుత్ కోతలు

- అవస్థలు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట: మండలంలో పలు గ్రామాల్లో గత వారం నుండి పది రోజులుగా విద్యుత్ కోతలు ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా అర్ధరాత్రి సమయాల్లో ప్రతిరోజు రెండు నుంచి మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచి పోతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో సరైన పారిశుధ్య నిర్వహణ లేక దోమల విపరీతంగా పెరిగి పోయాయి. రాత్రి సమయాలలో విద్యుత్ సరఫరా నిలిచి పోతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి 12 గంటల నుండి రెండు మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచి పోతుంది.

మండలంలో రాజాం, పోలేపల్లి, వడ్డాది విద్యుత్ సబ్ స్టేషన్‌లు ఉన్నాయి. ఈ సబ్ స్టేషన్లో ద్వారా మండలంలో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. విద్యుత్ సరఫరా నిలిచి పోతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతూ నిద్రకు దూరమవుతున్నారు. ప్రభుత్వం అధికారికంగా ఎటువంటి విద్యుత్ కోతలను ప్రకటించలేదు. కానీ మండలంలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా మాత్రం నిలిచిపోతుంది. ఇది అధికారుల వైఫల్యమో? అర్ధం కాలేదని ప్రజలు వాపోతున్నారు.


మాట్లాడుతున్న మాజీ జెడ్‌పిటిసి వేణుగోపాల్

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా ?

-మాజీ జెడ్‌పిటిసి వేణుగోపాల్

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో ఏఎల్.పురం మేజర్ పంచాయతీలో జరిగిన అభివృద్ధిపై వైసిపి నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమా అని మాజీ జెడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్ సవాల్ విసిరారు. ఆదివారం ఏఎల్.పురంలో విలేకర్లతో మాట్లాడారు. బాబు షూరిటీ మోసం గ్యారంటీ అనే కార్యక్రమంపై ఆయన తీవ్రంగా స్పందించారు. గ్రామంలో ప్రతి వీధికి సీసీ రోడ్లు, ఆర్టీసి కాంప్లెక్స్ అభివృద్ధి కూటమి హయాంలోనే జరిగాయన్నారు. ఐదు సంవత్సరాల పాటు ఎటువంటి అభివృద్ధి చేయలేని మీరు కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. సచివాలయం, హెల్త్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలు అసంపూర్తి పనులు చేసి ప్రజలకు అందుబాటులో తీసుకుని రాలేక పోయారని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలపై బురదజల్లే కార్యక్రమం తప్ప మీకు ఒరిగేది ఏమీ లేదన్నారు. స్పౌజ్ పించన్లు మీ హయాంలో ఎక్కడా ఇవ్వలేదని, కానీ కూటమి ప్రభుత్వ హయాంలో ఎంతో మందికి అందాయన్నారు.ఈ సమావేశంలో స్కూల్ చైర్మన్ లగుడు రాజు, స్వామినాయుడు, ఉప సర్పంచ్ గొంప వాసు పాల్గొన్నారు.


రమణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

టిడిపి నేత రమణకు ఘన నివాళి

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని చందనాడ గ్రామంలో విశాఖ డెయిరీ మాజీ వేతన కార్యదర్శి, టిడిపి నేత పుణ్యమంతుల రమణ 5 వ వర్ధంతి వేడుకలను ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామస్తులు, ఆదివారం ఘనంగా నిర్వహించారు.పాల సొసైటీ కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రమణ సేవలను కొనియాడారు.అనంతరం మహిళా పాడి రైతులకు చీరలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో వేతన కార్యదర్శి పుణ్యమంతుల బాబ్జి, గ్రామ పెద్దలు తళ్ళ అప్పలస్వామి, పి సత్తిబాబు, కర్రి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మత్స్యకారులు

బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయొద్దు

-పార్టీలకతీతంగా పోరాటం చేయాలి

-మత్స్యకారుల పిలుపు

ప్రజాశక్తి -నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయొద్దని రాజయ్యపేట మత్స్యకారులు డిమాండ్ చేశారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో ఆదివారం బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు సమావేశం ఏర్పాటు చేశారు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేస్తే తమ ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందని మత్స్యకారులు ఆవేదన చెందారు. ఇప్పటికే హెటిరో కంపెనీ కాలుష్యంతో ఈ ప్రాంతంలో మత్స్య సంపద నశించి పోవడంతో తామంతా ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర ప్రాంతాలకు వలసలు బాట పట్టామన్నారు. కంపెనీ కాలుష్యంతో గ్రామంలో క్యాన్సర్, కిడ్నీ సంబంధిత వ్యాధులతో పాటు, ఇతర అనారోగ్య సమస్యలతో తామంతా బాధపడుతున్నామని మత్స్యకారులు ఆవేదన వెలిబుచ్చారు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేస్తే పూర్తిగా ఉపాధి కోల్పోతామని, తాము ఈ ప్రాంతంలో నివసించలేని పరిస్థితి నెల కొంటుందన్నారు. హోం మంత్రి వంగలపూడి అనిత తమ జీవన విధానాన్ని దృష్టిలో పెట్టుకొని బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. పార్టీలకతీతంగా రాజీనామాలు చేసి బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ పోరాటం చేసేందుకు నాయకులు సిద్ధంగా ఉండాలని గ్రామానికి చెందిన మత్స్యకారులు కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

సొసైటీ ఛైర్మన్ల నియామకం

ప్రజాశక్తి-రావికమతం: మండలంలో మూడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం పర్సన్ ఇన్చార్జిల నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయని రావికమతం మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు కోమటి శంకర్రావు ఆదివారం తెలిపారు. మండలంలో కోఆపరేటివ్ సొసైటీలకు ముగ్గురు సభ్యులతో కూడిన త్రిసభ్య కమిటీలను ప్రభుత్వం నియమించిందనీ, అందులో ఛైర్పర్సన్ ఒకరు, ఇద్దరు సభ్యులతో కూడిన కమిటీని ప్రభుత్వం నియమించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాడుతూ, కొత్తకోట కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్గా పివిఎస్ఎన్ రాజు, సభ్యులుగా బలిరెడ్డి గణేష్, గట్రెడ్డి ఎరుకు నాయుడు, రావికమతం కోపరేటివ్ సొసైటీ ఛైర్మన్ గా ఉప్పులూరి నాగేశ్వరరావు, సోమిరెడ్డి శివశంకరు, గల్లా ఎర్రి నాయుడులను సభ్యులుగాను, చిన్నపాచీల కోఆపరేటివ్ సొసైటీకు కోన పరదేశి నాయుడును ఛైర్మన్గాను, బంటు నారాయణమూర్తి, గొంతిన సత్యరావు సభ్యులుగాను, మేడివాడ కో ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్గా గూటాల చిన్న, నక్క వెంకట్రావు, వజ్రపు రామ వెంకట ప్రసాద్ సభ్యులుగాను, నియమించుటకు అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయని తెలిపారు.

రేబాక సర్పంచ్‌కు పితృవియోగం

ప్రజాశక్తి- నక్కపల్లి: మండలంలో రేబాక గ్రామ సర్పంచ్ సాదిరెడ్డి శ్రీనివాసరావు (శ్రీను) కు పితృ వియోగం కలిగింది.సర్పంచ్ శ్రీనివాసరావు తండ్రి రమణ (72) గత కొన్ని రోజుల నుంచి అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం మధ్యాహ్నం రేబాక గ్రామంలోని తన నివాసంలో రమణ తుది శ్వాస విడిచారు. సర్పంచ్ శ్రీను, ఆయన కుటుంబ సభ్యులను విహెచ్‌పీ జిల్లా మాజీ అధ్యక్షులు గొట్టుముక్కల శ్రీహరి రాజు, చిన వెంకన్న, కాసుబాబు, యోగా గురువు దవరసింగి రాంబాబు,గ్రామ పెద్దలు యువకులు, మహిళలు పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

బోసి బాల్ క్రీడలో..బాల సరస్వతి భేష్

రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా ▶▶ అధికారుల ప్రశంసలు

ప్రజాశక్తి- రావికమతం :

మేము ఎవరికీ తక్కువ కాదు, తాము ఎవరికీ భారం కాకూడదని ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసి సాధారణ విద్యార్థుల వలె విద్యతో పాటు పాటు క్రీడా పోటీల్లో కూడా విశేష ప్రతిభ కనబరుస్తున్నారు విభిన్న ప్రతిభావంతులు. జాతీయ స్థాయి స్పెషల్ ఒలంపిక్ భారత్ క్రీడా పోటీల్లో సత్తా చాటి అందరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తుంది బాల సరస్వతి.

మైల్డ్ కేటగిరికి చెందిన మానసిక దివ్యాంగ విద్యార్థిని నక్కరాజు బాల సరస్వతి. రావికమతం మండలం కేబీపీ అగ్రహారం గ్రామానికి చెందిన మేధో వైకల్యం కలిగిన దివ్యాంగ విద్యార్థిని.బాల సరస్వతి. చిన్నతనంలోని వైకల్యాన్ని గుర్తించడం జరిగింది. తల్లిదండ్రులు శివయ్య నాయుడు, మహేశ్వరి వ్యవసాయ కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నారు. 1 నుండి 5వ తరగతి వరకు రావికమతం మండలం కేబిపి అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో విద్యను అభ్యసించి ఆరు నుండి 10వ తరగతి వరకు కేజీబీవీ గర్నికంలో విద్యను అభ్యసించడం జరిగింది. ఇంటర్మీడియట్ కేజీబీవీ రోలుగుంటలో చదివింది. ఆమె మేడివాడ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్, ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు ప్రోత్సాహంతో మండల, జిల్లా సాయిలో రన్నింగ్, మ్యూజికల్ చైర్, బోసి క్రీడా పోటీల్లో పాల్గొని గెలుపొందింది. దీంతో జిల్లా అధికారుల చేతుల మీదుగా మెడల్స్, సర్టిఫికెట్స్ అందుకొని ప్రశంసలు పొందింది. రాష్ట్రస్థాయి స్పెషల్ ఒలింపిక్ భారత్ క్రీడా పోటీలకు ఎంపిక అయ్యింది. విజయవాడ ఆగిరిపల్లిలోని హీల్ పారడైస్ స్కూల్లో గత నెల 21 నుండి 23 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి స్పెషల్ ఒలంపిక్ భారత్ క్రీడా పోటీల్లో బోసి గేమ్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి బోసి గేమ్ క్రీడా పోటీలకు ఎంపిక అయ్యింది. జూలై 24 నుండి 28 వరకు ఛత్తీస్‌గడ్ రాష్ట్రం బిలాస్పూర్‌లో జరిగిన స్పెషల్ ఒలంపిక్ భారత్ నేషనల్ ఛాంపియన్షిప్ బోసి గేమ్ క్రీడా పోటీల్లో మన రాష్ట్రం తరపున అద్భుతంగా ఆడి గెలిచి నాలుగవ స్థానం సాధించింది. స్పెషల్ ఒలంపిక్ భారత్ కమిటీ సభ్యులు రాజశేఖర్, అటల్ బీహార్ వాజ్పేయి యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ చేతుల మీదుగా మెరిట్ సర్టిఫికెట్ అందుకుంది. అలాగే కలెక్టర్ విజయ్ కృష్ణన్, జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు, జిల్లా సమగ్ర శిక్ష ఎడిషనల్ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ ఆర్ జయ ప్రకాష్, అప్పటి జిల్లా సహిత విద్య సమన్వయకర్త శకుంతల చేతుల మీదుగా మెడల్స్, సర్టిఫికెట్స్‌ను అందుకుంది. అలాగే బాల సరస్వతిని సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ ఆర్.జయప్రకాష్, జిల్లా సహిత విద్య సమన్వయ అధికారి బి. ఆర్ .వి రామకృష్ణ నాయుడు, చినగుమ్ములూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు శకుంతలు శాలువా కప్పి సన్మానించి అభినందించారు. రాష్ట్రం తరపున ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పెషల్ ఒలంపిక్ భారత్ నేషనల్ బోసి గేమ్ కోచ్ గా వెళ్ళి మన రాష్ట్రానికి ఆరు మెడల్స్ సాధించి సాధించేందుకు ఎంతో శ్రమించారు. అందుకుగాను జాతీయస్థాయిలో మహాలక్ష్మి నాయుడికి ప్రశంస పత్రాన్ని స్పెషల్ ఒలంపిక్ కమిటీ సభ్యులు అందించారు.

అందరికీ ఆదర్శంగా బాల సరస్వతి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా దివ్యాంగ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడా పోటీలు నిర్వహించి జాతీయ స్థాయికి పంపించడం జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర శిక్ష దివ్యాంగ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అన్ని విధాలుగా ప్రోత్సహిస్తూ, చేయూతని అందించడం జరుగుతుంది. బాల సరస్వతి జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొంది మిగతా విద్యార్థులందరికీ ఆదర్శప్రాయంగా నిలిచింది. దివ్యాంగులను ప్రోత్సహిస్తే రాణిస్తారు.



బి.రామకృష్ణ
జిల్లా సహిత విద్య సమన్వయకర్త,
సమగ్ర శిక్ష అనకాపల్లి జిల్లా



ప్రశంసాపత్రం, మెడల్‌లతో బాల సరస్వతి



కోచ్ మహాలక్ష్మినాయుడు పర్యవేక్షణలో ఆడుతున్న బాలసరస్వతి

అదాని స్మార్ట్ మీటర్లపై నిరసన



ఎడిఇ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అపార్టుమెంట్ల వాసులు

ప్రజాశక్తి-గాజువాక : అదాని స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని కోరుతూ జివిఎంసి 69వ వార్డు పరిధి తుంగ్లంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం చుక్కవానిపాలెం- తుంగ్లం జంక్షన్‌లో బహిరంగ సభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ నాయకులు ఎం.రాంబాబు మాట్లాడుతూ, అదాని స్మార్ట్ మీటర్ వల్ల కరెంట్ చార్జీలు విపరీతంగా పెరుగుతాయన్నారు. దీనికి వ్యతిరేకంగా సిఐటియు పోరాటం చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు, రైల్వే వేగన్ వర్క్ షాప్ ప్రెసిడెంట్ కె.అవతారం, కార్యదర్శి వి.రాజు సతీష్ పాల్గొన్నారు.

అదాని స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ తోకాడ ఫైవ్ అపార్ట్‌మెంట్స్ కమిటీ ఆధ్వర్యాన సమైఖ్య, సిరి, గ్రీన్ లైఫ్, స్వర్ణ సాయి అపార్ట్‌మెంట్‌కు చెందిన ప్రజలు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ తోకాడ సమైఖ్య అపార్ట్‌మెంట్ నుండి ఆటోనగర్ ఎడిఇ ఆఫీస్ వరకు సాగింది. అదాని స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కరపత్రాలు పట్టుకొని నినాదాలు చేశారు. అనంతరం ఎడిఇ ఆఫీస్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ల నాయకులు రామన్న, ఎం.వెంకటేశ్వరరావు, తౌడన్న మాట్లాడుతూ, కరెంట్ చార్జీలు తగ్గిస్తామని అధికారంలోని వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాదిలోపే సర్దుబాటు ఛార్జీల భారం మోపిందన్నారు. ఈ స్మార్ట్ మీటర్లకు సెల్‌ఫోన్ మాదిరిగానే ముందుగా డబ్బులు చెల్లించి రీఛార్జ్ చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్ చౌదరి, సిరి ఎనక్లేవ్ అపార్ట్‌మెంట్ వాసుల శివకుమార్, గ్రీన్ లైఫ్ అపార్ట్‌మెంట్ వాసులు నాగేశ్వరరావు, రఘుపతి, స్వర్ణ సాయి రెసిడెన్సికి చెందిన శ్రీనివాసరావు తాతారావు, స్థానిక అపార్ట్‌ంట్ వాసులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా భూపేష్ నగర్‌లో సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. అదాని మీటర్లతో కలిగే నష్టాలను నాయకులు స్థానికులకు తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఎం జగదాంబ జోన్ కన్వీనర్ ఎం.సుబ్బారావు, సీనియర్ నాయకులు వై.రాజు, సిఐటియు జోన్ కార్యదర్శి కర్రి చంద్రశేఖర్ పాల్గొన్నారు. స్మార్ట్ మీటర్లను తమ ఇళ్లకు బిగించొద్దంటూ స్థానిక మహిళలు వారి ఇళ్ల గోడలకు స్టిక్కర్లను అతికించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ స్మార్ట్ మీటర్లను అనుమతించబోమని ప్రతిజ్ఞ చేశారు.

నర్సీపట్నం టౌన్: ఆదాని స్మార్ట్ మీటర్లు మా ఇంటికి పెట్టొద్దని సిపిఎం ఆధ్వర్యంలో నర్సీపట్నంలో కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం సిపిఎం నేత ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ, స్మార్ట్ మీటర్‌లతో ప్రజలపై అధిక భారాలు పడుతున్నాయన్నారు. ఇప్పటికే విద్యుత్ రంగంలో ప్రజలపై అనేక భారాలు పెంచారని, ఈ స్మార్ట్ మీటర్లు ఎవరికోసం వేస్తున్నారని ప్రశ్నించారు.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టండి అని చెప్పారనీ, ఇప్పుడు ఏమీ మాట్లాడలేదన్నారు. అప్పుడు పగలగొట్టండి అని చెప్పిన మంత్రి ఇప్పుడు ఎందుకు స్పందించలేదన్నారు.ఇప్పటికైనా స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు.



తుంగ్లాంలో ర్యాలీ చేస్తున్న సిఐటియు నాయకులు



భూపేష్ నగర్‌లో నిరసన చేపడుతున్న స్థానికులు



నర్సీపట్నంలో ప్రచారం చేస్తున్న నాయకులు